

హైదరాబాద్ వార్త

# ఎసిబి దాడులు జరిగినా
# ఐ డోంట్ కేర్

**☛ అవినీతి హబ్‌గా రాజేంద్రనగర్ సర్కిల్ ఆఫీస్!**
**☛ అధికారుల పనితీరుతో భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి**
**☛ పలువురు అధికారులు ఎసిబికి చిక్కినా మారని తీరు**
**☛ ఎసిబి మరింత నిఘా పెంచాలి**



**అత్తాపూర్ జూలై25, ప్రభాతవార్త :** నగరంలో పలు జిహెచ్ఎంసి కార్యాలయంలో పలువురి అధికారులపై ఎసిబి అధికారులు దాడులు జరిపి పట్టుకున్నప్పటికి అధికారుల్లో మార్పు రావడం లేదని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని జిహెచ్ఎంసి కార్యాలయంలో అవినీతి విచ్చలవిడిగా పెరుగుపోతుందని సర్కిల్ పరిరిధిలోని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువలా వస్తున్నాయి. ఓ వైపు విమర్శలు, మరోవైపు ఆరోపణలు వినిపిస్తున్నా మనం చేయాల్సిన పనిలో ఏమాత్రం వెనక్కి తగ్గేది లేదు. అన్నట్లుగా రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పలు శాఖల అధికారులు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు పెరిగిపోతున్నా యి. ఇందులో టౌన్ ప్లానింగ్, ట్యాక్స్ కలెక్షన్, ఇంజనీరింగ్ విధాగం తదితర శాఖల అవినీతిలో తాము ఏమాత్రం తక్కువ కాదంటూ ఓ శాఖతో మరో శాఖ పోటి పడుతున్నట్లుగా ఉంది. అన్ని శాఖల్లోనూ అన్యాయ్యాలకు అలవాటు పడ్డ అధికారులు జనాలను పీల్చి పిప్పి చేస్తు న్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అధికారు లపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతు నా ఏమాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో జీహెచ్ఎంసి అధికారులపై ఉన్నతాధి కారులు నిఘా పెంచాలని సర్వత్రా డిమాండ్ పెరుగుతోంది.

**ఎసిబి దాడులు జరిగినా ఐ డోంట్ కేర్**

జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయాలలో ఎసిబి దా డుల్లో అధికారులు పట్టుబడినా ఏమాత్రం చల నం రావడం లేదు. ఎసిబి దాడులు జరుగుతుం టాయి. పోతుంటాయి ఐ డోంట్ కేర్ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి కార్యాలయంలో గత ఏడాది ఓ ఎఈ సిసి రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపుల విషయంలో 15 వేలు రూపాయలు డిమాండ్ చేసి ఎసిబి 5 పట్టుబడ్డారు. అదేవిధంగా ఫిబ్రవరి 24న ఓ పరిశ్రమకు సంబంధించి ఆస్తి పన్ను పెంచకుండా ఉండేందుకు బిల్ కలెక్టర్ మధు లక్ష రూపాయలు డిమాండ్ చేయగా ప్రైవేట్ అసిస్టెంట్ రమేష్ ద్వారా 45 వేల రూపాయలు తీసుకుంటున్న సందర్భంలో ఎసిబి అధికారులు పట్టుకున్నారు. అప్పుడు కూడా డిసిని మూడు గంటలు విచారించి వదిలేశారు. ఈ సంఘటన మరవక ముందే తాజాగా శుక్రవారం సర్కిల్ పరిధిలోని ఓ ఫుడ్‌కోర్టు నిర్వహణ కోసం యాజమాని నుండి రూ.5లక్షలు డిమాండ్ చేసి 2 లక్షల రూపాయలు తీసుకుంటుడగా రాజేంద్ర నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌ను ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఆయన కారులో దాచిన రూ.2లక్షల స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

**విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు:**

ఇళ్ల నిర్మాణాలకు పారదర్శకంగా పర్మిషన్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పుతున్నప్పటికి క్షేత్రస్థాయిలో అధికారుల చేయి తడపనిదే పనికావట్లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రాజేంద్రనగర్ పరిధిలో విచ్చలవిడి అక్రమ నిర్మాణాలు చకచక సాగుతున్నాయి. ఇచ్చిన అనుమతులకంటే ఎక్కువ ఫ్లోర్ల నిర్మాణాలు చేపడుతున్న అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిహెచ్ఎంసిలో టౌన్‌నింగ్ విభాగంలో అవినీతి తగ్గించడానికి ప్రభుత్వం ఎంత ప్రయత్నిస్తున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం అది కనిపించడం లేదు. దీంతో జిహెచ్ఎంసి అధికారుల పనితీరుతో మున్సిపాలిటీ ఆధాయానికి భారీగా గండిపడుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఉన్నాతాధికారులు నిఘా పెంచాలి :**

రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి కార్యాలయంలో గతంలో పనిచేస్తున్న ఎఈఓ కాంట్రాక్టర్ వద్ద డబ్బులు తీసుకుంటు ఎసిబి చిక్కడంతో అవినీతి బయటపడింది. అది మరవకముందే మళ్లీ బిల్ కలెక్టర్, శుక్రవారం డిసి రవి కుమార్ ఎసిబి చిక్కడంతో జిహెచ్ఎంసి కార్యాలయంలోని అన్ని శాఖల అధికారులపై ఎసిబి అధికారులు మరింత నిఘా ఉంచాలని దీంతో మరి కొంత మంది అవినీతిపరులు బయటపడే అవగాశం ఉందని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# వందమీటర్ల పరిధిలో 50లారీల చెత్త

**-బుల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన చెత్త**
**-క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**



నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, జూలై 25,ప్రభాతవార్త:** నాలాల్లో వరద సాఫీగా సాగేలా చూడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సిబ్బందికి సూచించారు. నాలాల్లో ఎక్కడైనా ఆటంకాలుంటే వెంటనే తొలగించాలని.. వరద నీరు సాఫీగా సాగితే అనేక ప్రాంతాలకు వరద ముప్పు తప్పుతుందన్నారు. ఈ మేరకు శుక్రవారం బుల్కాపూర్ నాలాతో పాటు.. ముషీరాబాద్‌లోని నాలాను హైడ్రా క్షత్ర స్థాయిలో పరిశీలించారు. అలాగే ప్యాట్నీ నాలా విస్తరణ పనులపై హైడ్రా కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. సుధూర ప్రాంతాల నుంచి హుస్సేన్‌సాగర్‌కు వర్షపు నీటిని తీసుకువచ్చే బుల్కాపూర్ నాలాలో చెత్త తొలగింపు పనులను పరిశీలించారు.

**100మీటర్లలో 50లారీల చెత్త..**

టోలీ చౌక్ సమీపంలోని విరాట్‌నగర్ వద్ద 100 మీటర్ల పరిధిలో 50 లారీల చెత్త బయట పడింది. చెత్త అక్కడ బయట వేయకుండా.. వెనువెంటనే లారీలకు నింపి తరలించాలని హైడ్రా కమిషనర్ సూచించారు. ఇరుకు సందులో లారీలు వెళ్లేందుకు వీలు లేకపోయినా.. స్థానికుల సహకారంతో చెత్తను తొలగించే పనులను హైడ్రా ముమ్మరం చేసింది. శంకరపల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి మొదలైన నాలా.. ఖానాపూర్, నాగులపల్లి దాటి ముందుగా గండిపేటను నింపి.. తర్వాత ఔటర్ రింగురోడ్డు దాటి.. నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, రాయదుర్గం, షేక్‌పేట, టోలీ చౌక్‌లోని హకీంపేట, మెహిదీపట్నం, బంజారా హిల్స్ రోడ్డు నంబరు 12, చింతలబస్తీ, తుమ్మల బస్తీ, ఖైరతాబాద్ చౌరస్తా మీదుగా హుస్సేన్ సాగర్‌కు చేరుతోంది. ఇలాంటి చారిత్రక నాలాలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న హైడ్రాకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్ పరిధిలోని పద్మా కాలనీలో ఇటీవల కూలిపోయిన నాలా రిటైనింగ్ వాల్ పరిసరాలను హైడ్రా కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. రిటైనింగ్ వాల్ కూలడంతో ప్రమాదకరంగా మారిన రెండు ఇళ్లను ఇటీవల హైడ్రా ఖాళీ చేయించిన విషయం విధితమే. వెంటనే రిటైనింగ్ వాల్ నిర్మించాలని కమిషనర్ ఆదేశించారు. 6 నుంచి 8 మీటర్ల వెడల్పుతో దాదాపు 500ల మీటర్ల మేర బాక్సు డ్రైన్ నిర్మించి.. పైన వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించాలని అక్కడి స్థానికులు హైడ్రా కమిషనర్‌ను కోరారు. ఈ ప్రతిపాదనను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. రిటైనింగ్ వాల్‌ను వెంటనే నిర్మించాలని కమిషనర్ సూచించారు. అలాగే సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ నాలా విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. శుక్రవారం హైడ్రా కార్యాలయంలో నాలా పనులపై కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్ తో కలిసి ఈ విషయమై సమీక్షించారు. హైడ్రా, హెచ్ ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ, కంటోన్మెంట్ అధికారులతో చర్చించారు. భారీ మొత్తంలో వచ్చిన వరద ప్యాట్నీ పరిసరాల్లో నాలా కుంచించుకుపోవడంతో పై భాగంలో ఉన్న ఆరేడు కాలనీలు నీట మునిగేవని.. ఇప్పుడు విస్తరించడంతో ఆ ముప్పు తప్పిందని అధికారులు తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మించడానికి ప్యాట్నీ పరిసరాల్లో అభ్యంతరం చెప్పడంతో ఆగాయని.. ఇటీవల వరద ముంచెత్తడంతో వెంటనే ఈ పనులు పూర్తి చేయాలన్నారు.

# నిండు కుండలా హుస్సేన్‌సాగర్



**పుల్‌ట్యాంక్ లెవల్‌కు నీటిమట్టం**

**హైదరాబాద్, జూలై 25,ప్రభాతవార్త:** ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవా హంతో హుస్సేన్‌సాగర్ నిండు కుండలా మారింది. బంజారాహిల్స్, కూకట్‌పల్లి, బుల్కాపూర్ నా లాలనుంచి హుస్సేన్‌సాగర్‌కు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో హుస్సేన్ సాగర్ నీటిమ ట్టం పుల్‌ట్యాంక్‌లెవల్‌కు చేరింది. హుస్సేన్‌సాగర్ నీటిమట్టం 513.41 మీటర్లు కాగా..ప్రస్తుతం నీటిమట్టం 513.19 మీటర్లకు చేరింది. దీంతో ఎఫ్‌టిఎల్ దాటకుండా వాటర్‌లెవల్‌ను అధికారులు మెయింటెన్ చేస్తూ తూముల ద్వారా మిగతా వాటిని మూసీలోకి విడుదల చేస్తున్నారు. హుస్సేన్ సాగర్‌లోకి ఎగువనుంచి 400 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా ..776 క్యూసెక్కుల నీటిని ఔట్‌ఫ్లో ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఈవరద నీరు అశోక్‌నగర్, దోమలగూడ, అంబర్‌పేట్ గోల్నాక ద్వారా వెల్లి మూసీలో కలుస్తుంది.

# పిల్లల సంరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి : కలెక్టర్ హరిచందన

**సైదాబాద్, జూలై 26 ప్రభాతవార్త :** జువైనల్ హోంలోని పిల్లల సంరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిచందన అధికారులను ఆదేశించారు. సైదాబాద్‌లోని జువైనల్ హోం ప్రభుత్వ బాలుర గృహాన్ని శుక్రవారం సందర్శించారు. హోంలోని పిల్లల సంఖ్య, వారికి అందుతున్న సదుపాయాలు, విద్యాబోధన, మెడికల్ సేవలు తదితర అంశాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల్లో పరివర్తన మార్పుకోసం మానసిక వైద్య నిపుణులతో అవగాహన కల్పించాలని సూచించారు. హోంలోని పిల్లలకు మెరుగైన విద్యాబోధన అందేలా చూడాలని, తగిన వైద్య సదుపాయలు కల్పించాలని సూచించారు. విద్యాబోధన చేస్తున్న విధానం, పిల్లలు ఉంటున్న గదులు, వంటగది, డైనింగ్‌హాల్‌తో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక బాలుడు తనను స్వగ్రామానికి పంపాలని కోరడంతో తక్షణమే స్పందించిన కలెక్టర్ తగిన చర్యలు చేపట్టి తనకు నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. వండిన ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం బాలుర పరిశీలన గృహాన్ని సందర్శించి నేరారోపణ ఎదుర్కొంటున్న బాలురకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ఇటీవల హోం నుంచి పారిపోయిన బాలుర వివరాలు, అనంతరం చేపట్టిన చర్యలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరారీ సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా భద్రతను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిడి చార్వక్, ఎడి రాజేందర్, సూపరింటెండెంట్ అఫ్జల్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**బ్రెయిలీ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా అందించాలి : కలెక్టర్**

అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపితో పాటు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా అందించాలని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన సంబంధిత అధికారులను ఆదేశించారు. మలక్‌పేటలోని అంధ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ప్రతి సదుపాయాన్ని అంధ విద్యార్థులకు చేర్చాలని ఆదేశించారు. విద్యార్థులు ఉండే గదులు, టాయిలెట్స్, స్టోర్ రూం, కిచెన్‌తో పాటు వసతి గృహం ప్రాంగణాన్ని మొత్తం కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆరోగ్య పరిరక్షణలో భాగంగా మెడికల్ చెకప్‌లు చేయించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు రాజేందర్, సైదాబాద్ మండల తహాశీల్దార్ జయశ్రీ, ప్రధానోపాధాయురాలు అస్రా ఫాతిమా, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జువైనల్ హోంలోని పిల్లలతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్ హరిచందన

# ముష్కిన్ చెరువును కాపాడే పనిలో హైడ్రా

**ఎఫ్‌టీఎల్‌లో పోసిన మట్టిని తొలగించాలని ఆదేశాలు**

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీలోని ముష్కిన్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన మట్టిని వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. ఆగస్టు నెలాఖరుకు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన మట్టితో పాటు.. పై భాగంలో వేసిన బండ్‌ను తొలగించాలని.. లేని పక్షంలో బాధ్యులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. అభివృద్ధి పేరిట చెరువు ఎఫ్‌టీఎల్‌లో బండ్ నిర్మించి.. పై భాగాన్ని చెరువు నుంచి బండ్ ద్వారా వేరు చేస్తున్నారని స్థానికుల ఫిర్యాదు తో..హైడ్రా శుక్రవారం హైడ్రా కార్యాలయంలో విచారణ చేపట్టింది. సీఎస్ ఆర్ నిధుల కింద చెరువును అభివృద్ధి చేస్తున్న తత్వ రియల్ ఎస్టేట్ సంస్థతో పాటు ఆ పనులు చేపట్టిన ద్రవాన్ష్ అనే ఎన్‌జీవో సంస్థ ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యమారు. చెరువు విస్తీర్ణం మొత్తం 50 ఎకరాల వరకూ ఉండగా..చెరువు చుట్టూ ఎగువ భాగంలో కూడా బండ్ నిర్మించడం తో కేవలం 12 ఎకరాలకు పరిమితం చేసినట్టు అవుతోందని నివాసితులు, ముష్కి చెరువు పరి రక్షణ సమితి ప్రతినిధులు హైడ్రా ముందు వాపోయారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత అభివృద్ధి పనుల పేరిట నిబంధనలకు వ్యతిరేకంగా చెరువులో మట్టి పోయడం పట్ల హైడ్రా కమిష నర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మట్టిని తొలగించి పూర్తి స్థాయిలో చెరువును కాపాడి అభివృ ద్ధి పనులు కొనసాగించాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



హైడ్రా కమిషనర్‌తో సమావేశమైన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

# అష్టలక్ష్మి దేవాలయం వద్ద శ్రావణ శోభ

**-బారులు తీరిన వేలాదిమంది భక్తులు**

**ఎల్.బి.నగర్, జూలై 25 ప్రభాతవార్త:** శ్రావణమాసం మొదటి శుక్రవారం ప్రారంభం కావడంతో అష్టలక్ష్మి అమ్మవారి దర్శనం కోసం వేలాదిమంది భక్తులు బారులు తీరారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవ డానికి మొదటి రోజైన శ్రావణ శుక్రవారం వేలాదిమంది భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో వాసవికాలనీలో శ్రావ ణ శోభ నెలకొంది. శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఆది లక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామి బంగారు వస్త్రాలతో భక్తులకు దర్శనం ఇచ్చారు. సంద ర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.



అమ్మవారి పూజలు చేస్తున్న పురోహితుడు.

# నాజోలికి రావద్దు..

**-జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి ఓవ్యక్తి బెదిరింపులు**
**-కార్లోనుంచి కత్తితీసి వీరంగం.. అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**హైదరాబాద్, జూలై 25,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఓ వ్యక్తి వీరంగం సృష్టించారు. రోడ్డు ఆక్రమణను అడ్డుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులను కత్తితో బెదిరించాడు. తన జోలికి వస్తే నరికేస్తానని రోడ్డు మీదే వార్నింగ్ ఇచ్చాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మిస్తున్నట్లు జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఇటీవల స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో శుక్రవారం నాడు పరిశీలనకు టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చారు. ఈ నేపథ్యంలో నూకారపు రామకృష్ణ అనే వ్యక్తి టౌన్ ప్లానింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగకుండా కారులో నుంచి కత్తిని తీసుకొచ్చి..ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులను నరికేస్తానని బెదిరించాడు. కాగా, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఫిర్యాదుతో ఘటనాస్థలికి వచ్చిన ఫిలింనగర్ పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

## అనుమతులు లేని సెల్లార్ సీజ్

**అత్తాపూర్ జూలై25,ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఉప్పర్‌పల్లిలోని పిల్లర్ నెంబర్ 182 దగ్గర ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న సెల్లార్‌ను డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు.

# బంగారు ఆభరణాలతో పరారైన యువతి అరెస్టు

**వివరాలు వెల్లడించిన బాలానగర్ డిప్యూటీ పోలీసు కమిషనర్ సురేశ్‌కుమార్**



**కుత్బుల్లాపూర్, జూలై 25 ప్రభాతవార్త** సేల్స్ విభాగంలో పనిచేసే ఓ యువతి చెప్పుల స్టాండ్‌లో దాచిన ఇంటి తాళాలతో ఇంట్లో ప్రవేశించి సుమారు సుమారు 23 తులాల బంగారు ఆభరణాలతో పారిపోయిన సంఘటనలో అదుపులోకి తీసుకుని ఆమెవద్ద నుండి సొత్తునుస్వాదీనం చేసుకున్న సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాలానగర్ డిప్యూటీ పోలీసు కమిషనర్ సురేశ్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 18న జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీకి చెందిన చిరంజీవి(30)ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటితాళం చెప్పులడబ్బాలో పెట్టి స్కూల్‌పిల్లలను తీసుకురావడానికి ఈనెల 18న వెళ్ళాగా ఇంట్లో దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో సుమారు 23 తులాల బంగారం, ఐదు తులాల వెండి చోరీకి గురయినట్లు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసున మోదు చేసుకున్న జగద్గిరిగుట్ట సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మా విచారణ ప్రారంభించగా అమీర్‌పేట్ మధురానగర్‌కు చెందిన బెబీ ఆలియాస్ ఆరోహి(23) యువతి జల్సాలకు అలవాటుపడి తాళాలు వేసివున్న ఇళ్లను ఎంచుకుంది. ఆల్విన్‌కాలనీలో చోరీలకు పాల్పడేందుకు నాలుగు ఇళ్లను పరిశీలించి చిరంజీవి అనే వ్యక్తి ఇంటిముందు చెప్పులస్టాండ్‌లో ఉన్నతాళం చెవిద్వారా తాళం తీసి ఇంట్లో దాచిన రెండు చెవి రింగులు, రెండు చైన్లు, ఒక బ్రాస్‌లెట్, రెండు బంగారు గాజులు, ఒక లాకెట్, ఒక ఓపోఫోన్ మొత్తం 23.3 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదు తులాల వెండి ఆభరణాలను దోచుకుని పోయింది. జగద్గిరిగుట్ట సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మా, డిటెక్ట్యూ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ రవిలతోపాటు వారి సిబ్బంది సి.సి.కెమెరాలతో శోధించి చోరీకి పాల్పడింది ఆరోహి(23)గా గుర్తించారు. బాలానగర్ డిసిపి సురేశ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో బోరబండలోనూ తాళాలువేసిఉన్న ఇళ్లను ఎంచుకుని దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఇళ్ల నుండి బయటకు వెళ్లేవాళ్ల తాళం చెవులు రెండు, అంతకంటే ఎక్కువ చేయించుకుని తమవద్దే పెట్టుకోవాలని, చుట్టుపక్కల వారికి కూడా తాము ఊరికి వెళుతున్నట్లు చెప్పాలని సూచించారు. ఈకేసును తక్కువ సమయంలో ఛేదించిన జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మా, డిటెక్ట్యూ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి వారి బృందాలను బాలానగర్ డిప్యూటీ పోలీసు కమిషనర్ సురేశ్ కుమార్ అభినందించారు. ప్రజలు దొంగతనాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాళం చెవులను చెప్పులడబ్బాలు, హెల్మెంట్‌లు, తలుపులు, కిటికిలపైన పెట్టకుండా ప్రత్యేక జాగ్రత్తలు వహించాని సూచించారు. ఇంటితాళాలకు సంబందించి రెండు లేదా అవసరాలకు తగ్గట్టుగా డూప్లికేట్ తాళంచెవులను చేయించఉకుని జాగ్రత్తపడాలని విజ్ఞప్తి చేశారు. ఈవిషయంలో తాము సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో పాటు సెక్టార్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందికి కూడా ప్రత్యేకంగా సలహాలు,సూచనలు తెలుపుతున్నామని సూచించారు.

## మహాకాళీ ఆలయంలో జనసేన నాయకుల పూజలు



హరిహరవీరమల్లు చిత్రం విజయ వంతం కావడంతో మహంకాళీ ఆలయంలో జనసేన నాయకులు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం.

బేగంపేట జులై 25,ప్రభాతవార్త

గురువారం విడుదలైన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా హరిహర వీరమల్లు సక్సెస్ అయిన సందర్భంగా సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో జనసేన నాయకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.పవన్ కళ్యాణ్ ఆదేశాలతో గబ్బర్ సింగ్ టీం,జనసేన పార్టీ నాయకులు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.టీటీడీ బోర్డు సభ్యుడు ,జనసేన పార్టీ నాయకులు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.టీటీడీ బోర్డు సభ్యుడు,జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి గ్రేటర్ హైదరా బాద్ జనసేన అధ్యక్షులు రాధారం రాజలింగం ,కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జి ప్రేమ్‌కుమార్‌లు తోటి నాయకులతో కల్సి అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ పూజారులు ఆశీర్వదించి సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ దైవం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మహాకాళీ అమ్మ వారికి పూజలు చేసారు. హరిహర వీరమల్లు సినిమా విజయవంతం అయినందుకు పవన్ కళ్యాణ్ గోత్రం,పేరుతో అర్చన చేపించి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండపాక కావ్య,దామోదర్‌రెడ్డి,సురేష్‌రెడ్డి,రమేష్, గబ్బర్ సింగ్ టీం సాయిబాబా,రమేష్,రాజు ప్రవీణ్ పాల్గొన్నారు.

## మహాకాళీ అమ్మ వారికి శాక సమర్పించిన భక్తులు



అమ్మ వారికి శాక సమర్పిస్తున్న భక్తులు.

బేగంపేట జులై 25,ప్రభాతవార్త

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాల జాతర సందర్భంగా అమ్మ వారి ఆదేశాను సారం రంగంలో అమ్మ వారు కోరిన విధంగా శ్రావణమాసం మొదటి శుక్రవారం రోజున అమ్మ వారికి పప్పు,బెల్లాలతో 21శాకలు సమర్పించారు.భక్తులు పెద్ద సంఖ్యలో తమ ఇళ్ల నుంచి శాకలు తయారు చేసుకుని వచ్చి అమ్మ వారికి సమర్పించినట్లు ఆలయ ఈ ఓ జి.మనోహర్ రెడ్డి తెలియజేసారు.మొదటి శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మ వారికి శాక సమర్పించి దర్శనం చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

## భాష, ప్రాంతాన్ని ప్రవాసభారతీయులు మరువద్దు

### -బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూలై 25 ప్రభాతవార్త:** విశ్వవ్యాప్తంగా ఎక్కడ తెలుగు వారున్న భాషను, ప్రాంతాన్ని మరువద్దని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అన్నారు.శుక్రవారం భారతీయ అసోసియేషన్ ఆఫ్ మలేషియా అధ్యక్షులు ది.సత్య, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రొయ్యూరు శేష సాయి తదితరులు రాష్ట్ర బిజెపి అధ్యక్షులుగా ఎన్నికైన ఎన్. రామచంద్రరావును కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. కాగా త్వరలో రాబోయే వినాయక చవితి నవరాత్రిమహోత్సవం మలేషియాలో జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనవలసిందిగా ఆహ్వానించడం జరిగింది. తప్పక హాజరవుతానని అన్నారు. తెలుగు జాతి పునరుత్తేజానికి ప్రతి ఒక్క ప్రవాసభారతీయుడు కృషి చేయాలన్నారు.

## ఆగస్టు 14న నగరంలో 'ఆటో బంద్'

**సైఫాబాద్, జులై 25 ప్రభాతవార్త:** ఆటోల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 14న హైదరాబాద్ నగరంలో ఒక రోజు 'ఆటో బంద్' నిర్వహిస్తున్నామని షేక్ హ్యాండ్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఎసి ప్రకటించింది. కొత్త ఆటో రిక్షాలకు షో రూం ధర ప్రకారం ఇప్పిస్తారా లేకపోతే పదవికి రాజీనామా చేస్తారా? అని జెఎసి కన్వీనర్ అమానుల్లాఖాన్ సిఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. షోరూమ్ డీలర్లు ఆటో ఫైనాన్షియర్లతో కుమ్మక్కై ఆటోలను బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి నగరం లోకి వచ్చే ఆటోలను నిషేదించాలని, టూ వీలర్ ట్యాక్సీలను బెంగుళూరులో మాదిరిగా హైదరాబాద్‌లో నిషేదించాలని, ఆటో మీటర్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు.

## అధ్వాన్నంగా రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ : రాముగౌడ్

**సైఫాబాద్, జులై 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉందని, రోజు, రోజుకు ప్రజలు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని జీవిస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బుర్ర రాము ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ జంటనగారాలో విచ్చల విడిగా దొరుకుతూనే ఉన్నాయని, వాటిలో పోలీస్ అధికారుల కుమారులే దొరకడమంటే పరిస్థిత ఏలా ఉందో అర్ధం చేసుకోవచ్చున్నారు. చాలా మంది యువకులు మత్తులో రోడ్డుమీదకు వచ్చి నానా హైరానా చేస్తున్నారని, దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని సిఎం, సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు, విద్యా శాఖ, హోం శాఖకు మంత్రులు లేకపోవడంతో విద్యా వ్యవస్థ కుంటుపడిందని, లా అండ్ ఆర్డర్ దెబ్బతిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి మాట, మాటకు ఢిల్లీ టూర్లు చేస్తున్నారని, కాని రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## గుండెపోటుతో పాదచారుడు మృతి

**అఫ్జల్‌గంజ్,జులై 25ప్రభాతవార్త:** పని నిమిత్తం నగరానికి వచ్చిన ఓ పాదాచారుడు నడుచుకుంటూ వెళ్లుఅకస్మాత్తుగా కుప్పకూలి పోయి మృతి చెందిన సంఘటన సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్.ఐ ముజతాబ్బాఅలీ కథనం ప్రకారం...నిజామాబాద్ జిల్లాకు చెందిన శరత్‌చంద్ర(44) పనినిమిత్తం నగరానికి వచ్చి కింగ్ కోఠి వైపు నుంచి సుల్తాన్‌బజార్ వైపు నడుచుకుంటూ వస్తున్నాడు.అకస్మాత్తుగా కింద కూప్పకూలి పోయాడు.దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.అప్పటికే మరణించినట్లు ద్రువీకరించారు.ఈ కేసును ఇన్స్పెక్టర్ నరసింహా ఆద్వర్యంలో ఎస్.ఐ ముజతబా అలీ దర్యాప్తు చేస్తున్నారు.

## పేద కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి : భేరి రామచందర్‌యాదవ్

శేరిలింగంపల్లి జులై 25 ప్రభాతవార్త

పేద కార్మికులకు ప్రభుత్వం ఆదుకోవాలని బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్‌యాదవ్ కోరారు. ఈ మేరకు బీసీ సంఘాలు, జాతీయ భవన నిర్మాణ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మం త్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్, జాతీయ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ఛైర్మన్ కే.లక్ష్మయ్యలు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు, పేదకూలీలు, కార్మిక వర్కర్ల సమస్యలను దృష్టిలోపెట్టుకునిప్రభుత్వం సంక్షేమ పథకాలను వారికి అందేలా సహాయపడాలని కోరారు. పేద భవన నిర్మాణ కార్మికులు,కూలీలకు ప్రాధాన్యత కల్పిస్తూ వారి డిమాండ్లకు పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యంగా ప్రతి అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కెటాయించాలని, విద్య విషయంలో పేదలకు కార్మిక సోదరుల పిల్లలకు హాస్టళ్లఓ సీట్లు కెటాయించి ఉచిత విద్యను అందించాలన్నారు. వైద్యం విషయంలో ఇన్సూరెన్స్ ద్వారా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధిలో ఉన్న వర్కర్స్‌కు ఆసుపత్రిలో చికిత్స చేసుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలన్నారు. విదేశీ విద్యను అభ్యసించేందుకు వెళ్లే కార్మికుల పిల్లలకు 20లక్షల రుణం మంజూరు చేయాలని కోరారు. ఆయా కార్మిక సంఘాలకు స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసిన సంక్షేమం దృష్టితో సహకరించాలన్నారు. గర్భిణీ స్త్రీలకు కాన్పు ఖర్చుల కింద ప్రభుత్వం లక్షరూపాయలు కెటాయించాలన్నారు. యాక్సిడెంట్‌లో మరణించిన కార్మికులు 10లక్షల సాయం,అంబులెన్స్ ఖర్చులు కూడా ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రమాదం జరిగి ప్రాణం కోల్పోయినప్పుడు, అవయవ లోపం జరిగినప్పుడు ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. మంత్రిని కలిసిన వారిలో జాతీయ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అనంతయ్య, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్‌కే సాయన్న ముదిరాజ్,మాజీ డీఎస్పీ పోలీస్ బంటు రాములు, అనంతయ్య కుమార్ యాదవ్, కార్యదర్శి మేకు నరేందర్,రాష్ట్ర కార్యదర్శి కాశీనాథ్, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యదర్శి కిషన్; సలహాదారులు అనంతయ్య,మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జునరావు, వికారాబాద్ జిల్లా అద్యక్షులు ఉప్పరి కిష్టయ్య, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు ప్రదీప్‌మహేశ్,శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసి వినతిపత్రాన్ని అందిస్తున్న బీసీ సంఘాల నాయకులు

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### - మణికొండ మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావ్

**నార్సింగి, జూలై 25 ప్రభాతవార్త :** ప్రజలందరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని మణికొండ మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావ్ పేర్కొన్నారు. శుక్రవారం మణికొండ మున్సిపల్ పరిధి అల్కాపూర్ టౌన్‌షిప్ అబ్దుల్ కలాం పార్కులు వంద రోజుల ప్రణాలికలో భాగంగా "వన మహోత్సవం"ను నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ శరత్‌చంద్ర, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావ్ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడ చెట్లు అధికంగా ఉంటాయో అక్కడ వాతావరణం చల్లగా ఉంటుందని, వర్షాలు విరివిగా కురుస్తాయన్నారు. భూగర్భ నీటి మట్టం పైపైనే ఉంటుందన్నారు. పట్టణీకరణ కారణంగా చెట్లను తొలగించి భారీ భవనాలు వెలుస్తున్నాయని, ప్రతీ ఇంటి ముందుకు చెట్లు నాటుకొని పచ్చట మొక్కలు పెంచాలన్నారు. మొక్కలకు తమ బిడ్డల పేర్లు పెట్టుకొని నిత్యం నీరు పోస్తే అవి మనం చనిపోయేంత వరకు కోట్లాది రూపాయల విలువ చేసే ప్రాణ వాయువును మనకు అందిస్తాయని, పువ్వులు, ఫలాలను కూడా ఇస్తాయని వివరించారు. మొక్కల నుంచి వెలువడే ప్రాణ వాయువు లెక్క కట్టలేమని, ఇంతటి విలువైన మొక్కలను బాధ్యతగా పెంచుదామని ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఇ శివసాయి, సంజయ్, గౌతమ్ మాడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



మణికొండ మున్సిపాలిటీ పరిధిలో వన మహోత్సవంలో మొక్కలు నాటుతున్న కమీషనర్ ప్రదీప్ కుమార్, విద్యార్థుల దృశ్యం.

## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, జూలై 25 ప్రభాతవార్త:** భారీవర్షాలు కురుస్తున్న కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ సూచించారు. శుక్రవారం డివిజన్ లోని లోతట్టు ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి జిహెచ్ఎంసి, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. అరుంధతి నగర్, అశోక్ నగర్, జవహర్ స్కూల్ మరియు పలు చోట్ల జిహెచ్ఎంసి నిర్వహించిన వరదనీటి క్రమబద్ధీకరణ పనులను పరిశీలించారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ కోరారు. వర్షాల వల్ల వరద నీరు నిలవకుండా చేపట్టిన పనులను అధికారులు, హైడ్రా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ అప్రమత్తంగా ఉండాలని,సమస్యాత్మక ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, వాటర్ వర్క్స్ డిజిఎం కార్తీక్ రెడ్డి, జిహెచ్ఎంసి డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్ వారి సిబ్బంది, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, వివిఎస్‌టి రాజు,పి నర్సింగ్ రావు ,ఎం ఉమేష్,సత్తి రెడ్డి,సురేష్,ఆనంద్ రావు మరియు మెరుగు శ్రీనివాస్ యాదవ్,ఆరోగ్యం, చిప్స్ రాజు, జాకబ్ రాజు, వున్న సత్యనారాయణ, భూమయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



లోతట్టు ప్రాంతాలలో పర్యటిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్

## మానవత్వమే అంతర్లీనంగా సినారె రచనలు

### రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ

**రవీంద్రభారతి, జూలై 25 ప్రభాతవార్త :** మూర్తీభవించిన మానవమూర్తి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా. సి.నారాయణరెడ్డి అన్న తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ సినారె ఎన్నో ప్రక్రియల్లో చేసిన రచనలన్నీ మానవత్వమే అంతర్లీనంగా ప్రస్ఫుటమవుతాయని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డా. సి.నారాయణరెడ్డి మానవతా కవితాగానం శీర్షికన నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా. మామిడి హరికృష్ణ సినారె చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి మాట్లాడారు. సినారె వ్రాసిన సినీగీతాల్లో ఎక్కువశాతం మానవతా సందేశమే ప్రధాన భూమికగా సాగి ఎంతగానో ఆకట్టుకొని ప్రతీఒక్కరిని ఆలోచింపజేశాయని, స్ఫూర్తిమంతంగా నిలిచాయని పేర్కొన్నారు. భిన్న ప్రక్రియల్లో మానవతా అంశాలను ఎంపిక చేసుకుని ఆకట్టుకునేలా గానం చేసిన సుధాకర్‌ను హరికృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో గాయకుడు దేవత సుధాకర్ మహాకవి సినారె మానవత్వం వెల్లివిరిసేలా గొప్పగా రచించిన పలు పద్యాలు, గజళ్లు, ద్విపదులు, ప్రపంచపదులు, లలిత, జానపద, సినీ, దేశభక్తి గీతాలను సుమధురంగా ఆలపించి విచ్చేసిన ఆహూతులను తన్మయుల్ని చేసి సంగీతలోకంలో విహరింపజేశాడు. గురు ప్రసాద్, సతీష్, జయకుమారాచార్య, లింగా శ్రీనివాస్‌లు అద్భుత వాద్యసహకారం అందించి మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమంలో సినారె కుమార్తెలు గంగ, సరస్వతి, ప్రభాకర్‌రెడ్డిలతోపాటు ఇతర కుటుంబ సభ్యులు, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య, అనేకమంది ప్రముఖులు, కవులు, గాయకులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు ముందుకు రావాలి



పుప్పాలగూడ ప్రాథమిక పాఠశాలలో యూత్‌ఫర్ సేవా ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందిస్తున్న మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్.

**నార్సింగి, జూలై 25 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు మంరింత మంది ముందుకు రావాలని మణికొండ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం పుప్పాలగూడలోని ప్రభుత్వ పాఠశాలలో యూత్‌ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా బ్యాగ్‌లు, నోటు బుక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచిచ్చేసిన కస్తూరి నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ సర్కారు బడుల్లో చదువుతున్న వారంతా నిరుపేదల బిడ్డలేనని తెలిపారు. ఇలాంటి వారికి సమాజంలో ఆర్థికంగా స్థిరపడ్డ వారు సహకారం అందించి వీరి జీవితంలో వెలుగులు నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గండిపేట ఎంఇఓ గొర్రె విజయ్ కుమార్,మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, ప్రధానోపాధ్యాయులు మంగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొ. ప్రభంజన్ యాదవ్ మృతి తీరని లోటు



ప్రసంగిస్తున్న ప్రభంజన్ యాదవ్ సంస్మరణ సభలో బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్

**చిక్కడపల్లి, జూలై 25 ప్రభాతవార్త:** ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మరణం బహుజన సమాజానికి తీరని లోటని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి ఓంకార్ భవన్‌లో ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ సంస్మరణ సభ బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ( బి యల్ యప్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రభంజన్‌యాదవ్ చిత్రపటానికి నల్లా సూర్యప్రకాష్ పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతూ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ బహుజన సమాజం ఎంతో కృషి చేశారిన, ఢిల్లీలో , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉద్యోగం చేస్తు మండల్ రిజర్వేషన్ సమస్య వచ్చినపుడు ఖచ్చితంగా మండల్ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలని సాగిన పోరాటం లో బిసి బిడ్డగా బహుజన సమాజం కోసం పోరాడిన వారిని వారు తెలంగాణ ఏర్పాటు లో జరిగిన అనేక ఉద్యమాలలో పాల్గొని తెలంగాణ లో సామాజిక తెలంగాణ కావాలని గట్టిగా పోరాడిన వ్యక్తి ప్రభంజన్ యాదవ్ అని ఆయన మరణం తీరని నష్టాన్ని కలిగించిందని అన్నారు. కార్యక్రమంలో యంసిపిఐ ( యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీనియర్ కమ్యూనిస్టు నాయకులు జి. రాములు,బిసిపి రాష్ట్ర కార్యదర్శి పర్వతాలు, ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకటస్వామి, బి యల్ యప్ రాష్ట్ర నాయకులు కుంభం సుకన్య, వాంకుడోతు తుకారాం నాయక్, తాండ్ర కళావతి, కర్ర దానయ్య మారోజు సునిల్, వరికల్ గోపాల్, బర్రె సంజీవ, గ్యార సాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ విశ్వంభరుడు సినారె : సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి, జూలై 25 ప్రభాతవార్త:** విశ్వంభర కావ్యం తో జ్ఞాన పీఠం స్థాయికి చేరిన సినారె జాతీయ సాహిత్యం లో విశ్వంభరుడు అని శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు .సినారె రచించిన విశ్వంభర కావ్యం ఆధునిక సాహిత్యం లో.సుస్థిర స్థానం సంపాదించుకున్నదన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హన్మంతరావు కళావేదికలో గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జ్ఞానపీఠ అవార్డుగ్రహీత డాక్టర్.సి.నారాయణరెడ్డి జయంతి సభ జరిగింది. సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ తెలంగాణ మారుమూల పల్లె నుంచి తన అక్షర శక్తి తో కేంద్రం నుంచి పద్మవి భూషణ్ గా గౌరవించబడిన సినారె రాష్ట్ర ప్రభుత్వం పలు పదవులకు ఎంపిక చేసిందనీ గుర్తు చేశారు. నాటి మహా నటుడు ఎన్ టి ఆర్ కు అత్యంత ఆత్మీయుడు ఇన సినారే తొలిసారి గా ఆయన కు పాట రాసి సినీ రంగ ప్రవేశం చేశారని ప్రశంసించారు. ప్రధాన ప్రసంగం చేసిన సాహితీ వేత్త బి జయ రాములు సినారె రచించిన కావ్యాలు విశ్లేషణ చేశారు. విశ్వంభర కావ్యం కథ వస్తువు మానవుడు అని అదిమ మానవుడు నుంచి ఆధునిక మానవుడుగా మారిన పరిణామ క్రమం వివరిస్తుస్తుందని తెలిపారు. సినారె తన కుమార్తె లకు గంగ యమున సరస్వతి కృష్ణ నదుల పేర్లు పెట్టటం వెనుక జీవ జలాలు పై అయన కున్న ప్రేమ తెలుపుతుందని వివరించారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ సినారె కు గాన సభ తో ఐదు దశాబ్దాల అనుబంధం వుందని గుర్తు చేశారు. తమ తండ్రి కళా సుబ్బారావు ను అమితం గా అభిమానించే వారని, ఏ చిన్న కార్యక్రమానికి ఇనా చిన్న పెద్ద హాల్స్ తో నిమిత్తం లేకుండా గాన సభ కు వచ్చేవారని, అది అయన సహృదయత కు నిదర్శనం అన్నారు. వేదిక పై ఓంకార్ రాజు, బింగి నరేందర్ గౌడ్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు



ప్రసంగిస్తున్న శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి

## రెండు కేసుల్లో ముగ్గురిపై కేసు నమోదు.. ఇద్దరు అరెస్టు

### రూ.3.50లక్షల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్,జులై 25,ప్రభాతవార్త :** ముగ్గురు పెళ్లాల ముద్దులమొగుడు పెళ్ళాల పోరు ఒక వైపు, మరో వైపు కుటుంబ పోషణ. ఈ జీవన పోరాటంలో హత్యాయత్నం కేసులో షేక్ మహబూబ్ అలం అనే వ్యక్తి చర్లపల్లి జైలుకు వెళ్ళాడు.ఈ క్రమంలో జైలుకు వెళ్ళిన షేక్ మహబూబ్ అలంకు గంజాయి కేసులో జైల్లో ఉన్నా విజయవాడకు చెందిన కాంపల్లి తిరుపతి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయంతో ముగ్గురు బార్యలు, పిల్లలను, కుటుంబ భారం మోయాలంటే ఈజీ మనీ వ్యాపారం చేయాలని తిరుపతి షేక్ అలంకు సలహా ఇచ్చాడు.తిరుపతి ఇచ్చిన సలహా మేరకు విజయవాడ నుంచి తీసుకువచ్చి ఇచ్చిన గంజాయిని కీసర మండలం దమ్మాయిగూడ ప్రాంతంలో పలువురితో కలిసి జైలు నుంచి వచ్చిన 3 నెలల నుంచి గంజాయి అమ్మకాలు జరిపిస్తూ..ఘటకేసర్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. ఘటేకేసర్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ జె.రవి, ఎస్సైలు నందిని, సంగీత సిబ్బంది కలిసి గంజాయి అమ్మకాలపై వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలోనే గంజాయి అమ్మకాలు జరుపుతున్న నవాబుఖాన్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు.నిందితుడి వద్ద ఉన్న 230 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని,ఆతడిపై కేసు నమోదు చేశారు.ఈ గంజాయి ఎక్కడి నుంచి కొనుగోలు చేశావని ఎక్సైజ్ పోలీసులు ప్రశ్నించడంతో నిందితుడు ఇదే దమ్మాయిగూడకు చెందిన షేక్ మహబూబ్ అలం పేరు చెప్పాడు.నిందితుడు నవాబుఖాన్‌పై జవహార్ నగర్‌లో కూడా కేసు నమోదైంది. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు ఎక్సైజ్ సీఐ,ఎస్సైలు సిబ్బంది కలిసి షేక్ మహబూబ్ షేక్ అలం ఇంటిపై దాడి చేశారు.ఈ దాడిలో షేక్ మహబూబ్ అలం ఇంట్లో 6.420 కేజీల గంజాయి పట్టుకున్నారు.ఈ గంజాయిని ఎక్కడి నుంచి తీసుక వచ్చావని ప్రశ్నించినపుడు జైల్లో పరిచయమైన కాంపల్లి తిరుపతి తీసుకు వచ్చాడని,గంజాయి ఇతరులతో అమ్మకాలను జరిపిస్తున్నాడని షేక్ మమహబూబ్ అలం ఎక్సైజ్ సీఐకి తెలిపాడు.గంజాయితో పట్టుబడిన ఇద్దరితోపాటు గంజాయి సరఫరా చేసిన తిరుపతిపై కూడ కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.

### నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్, జులై 25, ప్రభాతవార్త

మైటాస్ సబ్ స్టేషన్ నుండి 11కేవీ వెంకటసాయి ఫీడర్‌లో ఉదయం 10:30 గంటల నుండి 12:00 గంటలు ఈశ్వర్ విల్లాలు, రాక్ చర్చి ప్రాంతం, ఎస్బిఐ బ్యాంక్ వెనుక వైపు, ఆదిత్య లగూన్స్ అపార్ట్‌మెంట్స్, వజ్రా ప్రతీక్ ప్రాంతాలు అలాగే ప్రశాంతిహిల్స్ సబ్ స్టేషన్ నుండి 11కేవీ వజ్రా ఫీడర్ లో ఉదయం 10:30 గంటల నుండి 12:00 గంటల వరకు వజ్రా ప్రతీక్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

### సిఎం సహాయ నిధి పేదలకు చేయూత : మాధవరెడ్డి

కుత్బుల్లాపూర్, జులై 25 ప్రభాతవార్త

ఆర్థికంగా వెనకబడి తీవ్ర అనారోగ్యంతో కొట్టుమిట్టాడే ప్రతి ఒక్కరికి భారత రాష్ట్రసమితి చేయూత నిచ్చిందని పార్టీ ఉద్యమ నాయకులు సంపతి మాధవరెడ్డి అన్నారు. సిఎం సహాయ నిధిలో బాగంగా గాజులరామారం డివిజన్‌లోని అమీరొద్దీన్ మహ్మద్ బషీరుద్దీన్(57)కు,జీడిమెట్ల వివేకానంద డివిజన్‌కు చెందిన లక్ష్మమ్మ(72)అనారోగ్య సమస్యతో సతమతమవుతుండగా వారికి2.35లక్షల చెక్కులను అందజేశారు. బిఆర్ఎస్ నాయకులు మక్బూద్ ఆలీ,ప్రవీణ్‌ల ద్వారా తెలుసుకుని అర్హులైన లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా చింతల్‌లోని ఎంఎల్ఎ కార్యాలయంలో చెక్కులను అందజేసి అనంతరం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపతి మాధవరెడ్డి మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతినిరుపేదకు ఖచ్చితమైన ఆర్థిక సహాయం అందజేసేందుకు స్థానిక శాసనసభ్యులు వివేకానంద్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. మెరుగైన చికిత్సకోసం ఎదురుచూసే ప్రతిఒక్కరిని గుర్తించి ప్రభుత్వం నుండి ఆర్థికసహాయం అందించడంలో వివేకానంద్ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు.కార్యక్రమంలో ఫాక్స్‌సాగర్ చెరువు డైరెక్టర్ పరుశ శ్రీనివాస యాదవ్,గాజులరామారం డివిజన్ టిఆర్ఎస్‌అధ్యక్షులు విజయ రామిరెడ్డి, ఉధ్యమనేత కస్తూరి బాల్‌రాజ్, న్యాయవాది కమలాకర్, సుధాకర్, నరేందర్‌రెడ్డి, సమ్మయ్య నేత, ఎల్లాగౌడ్, నదీమ్‌రాయ్, అయోధ్యనగర్ ఏసు, కుంట వేణు, చిన్నా, నవీన్, శివ నాయక్, ప్రసాద్, బి.రాధాభాయ్, డి.దుర్గా తదితరులు పాల్గొన్నారు.

### నల్లకుంట డివిజన్‌లో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

హైదరాబాద్,జూలై 25,ప్రభాతవార్త:

నల్లకుంట డివిజన్‌లో బాయమ్మ గల్లిలో శుక్రవారం సిసి రోడ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,కార్పొరేటర్ వై. అమృతతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా ఈసిసి రోడ్ పనులకు దాదాపు రూ. 86 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. ఇది స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంలో కీలకపాత్ర పోషించనుందని తెలిపారు. ఈకార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ప్రవీణ్, ప్రశాంత్, నరేందర్, డివిజన్ ప్రెసిడెంట్ మేడి ప్రసాద్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు, మహిళా కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### బాలాంత్రపు వెంకటరమణకు 'కిన్నెర-సినారె సాహితీ పురస్కారం

**చిక్కడపల్లి, జూలై 25 ప్రభాతవార్త:** కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ్ పురస్కారగ్రహీత, డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా 'ప్రబంధ సాహిత్య విశ్లేషకుడు బాలాంత్రపు వేంకటరమణకు 'కిన్నెర-సినారె సాహితీ పురస్కారం-2025' ప్రదానోత్సవ కార్యక్రమాన్ని 30న నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్ వివరించారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ పూర్వసలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి హాజరై పురస్కారాన్ని అందచేస్తారని, కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, కవి, నారుమంచి వేంకట అనంతలక్ష్మి, తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తదితరులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సినారె సినీ సంగీత విభావరి ఉంటుందని, ఇందులలో గాయనీ గాయకులఉ ఆమని, చంద్రతేజ, సుభాష్ గానం చేస్తారన్నారు.

## ఆపరేషన్ సింధూర్ ఎన్‌సిసి కేడెట్‌లకు స్ఫూర్తి - లెఫ్టినెంట్ కల్నల్ లక్ష్మణ్

హైదరాబాద్, జులై 25,ప్రభాతవార్త:

ఆపరేషన్ సింధూర్ భారత సైనిక శక్తి, ఐక్యతను ప్రపంచానికి చాటిన చారిత్రక సంఘటనగా నిలిచిందని, దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఎన్‌సీసీ కెడెట్‌లు దేశభక్తి, క్రమశిక్షణతో దేశ సేవకు సిద్ధం కావాలని లెఫ్టినెంట్ కల్నల్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. హబ్సీగూడలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన ఫిఫ్త్ (తెలంగాణ) బెటాలియన్ ఎన్‌సీసీ సెమినార్‌లో ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆపరేషన్ సింధూర్ విశేషాలను కెడెట్‌లకు వివరించారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ కల్నల్ లక్ష్మణ్ మాట్లాడుతూ, ఆపరేషన్ సింధూర్‌లో భారత సైన్యం అసాధారణ ధైర్యసాహసాలతో కేవలం 22 నిమిషాల్లో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసి తన సత్తా చాటిందన్నారు. ఈ విజయం దేశ భద్రతను కాపాడడమే కాక, యువతకు స్ఫూర్తిగా నిలిచిందని, ఎన్‌సీసీ కెడెట్‌లు ఈ సంఘటన నుంచి ప్రేరణ పొంది దేశ సేవలో ముందుకు సాగాలని సూచించారు. ఈ విజయం భారతీయులందరి గర్వకారణమని, ఐక్యంగా దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ సింధూర్‌లో ఉపయోగించిన మిసైల్ టెక్నాలజీ, ఎస్400 ఇంటర్‌సెప్టర్స్ వంటి అధునాతన సాంకేతికతలను కెడెట్‌లకు వివరించారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.థెరిసా, ఎన్‌సీసీ ఫిఫ్త్ (తెలంగాణ) బెటాలియన్ ఇన్‌స్ట్రక్టర్లు, కెడెట్‌లు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్‌కు వినతి



ఒకటో డివిజన్ పరిధిలో ప్రజలకు మౌళిక వసతులు కల్పించాలని బండ్లగూడ కార్పోరేషన్ కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నార్సింగి, జూలై 25 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని ఒకటో డివిజన్ పరిధిలో మౌళిక వసతులు కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు హరీష్ గౌడ్, రాంప్రసాద్‌రావ్‌లు శుక్రవారం కమీషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైరాగిగూడలోని ప్రధాన రహదారికి మరమత్తులు చేయాలని, డబుల్ బెడ్ రూం ఇళ్ల సొసైటీలో వంద రోజుల ప్రణాలిక కార్యక్రమాన్ని నిర్వహించాలని, పక్కనే ఉన్న పార్కును అభివృద్ధి చేయాలని కమీషనర్‌ను కోరామన్నారు. ఎడతెంపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గంధంగూడ ప్రధాన రహదారి గుంతలమయమైందని, పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకెళ్లి, ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వినతిపత్రం అందుకున్న కమిషనర్ శరత్‌చంద్ర స్పందిస్తూ వీలైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయిస్తామని హామీనిచ్చారని నాయకులు వివరించారు. కమీషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో చిట్టిబాబు, శాంత కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## నేడు అలయ్ బలయ్ కార్యక్రమం..

### అతిథిలుకు మాధవరం కాంతారావు ఆహ్వానం

కెపిహెచ్బి కాలనీ, జూలై 25, ప్రభాతవార్త

వర్గీకరణకు కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు, బడుగు బలహీన వర్గాల పక్షాన నిలబడిన నాయకుడు మంద కృష్ణ మాదిగ చేసిన చేస్తున్న సేవలను గుర్తించి భారత ప్రభుత్వం ఆయనకి పద్మశ్రీ అవార్డు అందించిన శుభ సందర్భంగా నేడు ఉదయం 10 గంటలకు, ఓల్డ్ బోయినపల్లి మల్లారెడ్డి గార్డెన్స్ వద్ద మాధవరం కాంతారావు మిత్ర మండలి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అలయ్ బలయ్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సభాస్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం కమిటీ సభ్యులతో పలు కీలక అంశాలపై చర్చించారు. ఇక ఈ అలయ్ బలయ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ హాజరవుతున్నారని అదేవిధంగా రాష్ట్రంలోని వివిధ కుల సంఘాల ప్రతినిధులు సైతం హాజరవుతున్నారని తెలిపారు.

## బోయిన్‌పల్లి మార్కెట్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి



రైతు కమీషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతిత్రం అందజేస్తున్న బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ దేవుడు

**కంటోన్మెంట్, జూలై 25 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ బోయిన్‌పల్లి మార్కెట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని, వాహనాల రాకపోకలకు వెనుక భాగంలో మరో ద్వారంను పునరుద్ధరించేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ శుక్రవారం మార్కెట్ యార్డు చైర్మన్ ఆర్. ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్‌లు తెలంగాణ రాష్ట్ర రైతు కమీషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు స్థలం మార్కెట్ వెనుక భాగంలో ఉండడంతో మార్కెట్‌లోకి వచ్చే వాహనాలు బయటకు వెళ్లేందుకు ద్వారాన్ని ఏర్పాటు చేసేందుకు కంటోన్మెంట్ బోర్డు అధికారులతో అనుమతి పొందేందుకు చర్యలు తీసుకోవాలని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్, సభ్యులకు గౌరవ వేతనం ఇప్పించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని ఆయన దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు. మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని కోదండరెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

### 3న జింఖానా మైదానంలో మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడలు : జంపనప్రతాప్



కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు జంపనప్రతాప్,

**కంటోన్మెంట్, జూలై 25 ప్రభాతవార్త:** వచ్చే నెల 3న సికింద్రాబాద్ జింఖానా మైదానంలో హైదరాబాద్ జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రీడా పోటీల ప్రారంభోత్సవ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సిఈఓను కలిసిన వారిలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభుకుమార్ గౌడ్, కోశాధికారి డి.లక్ష్మిలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



జలమండలి జీఎం వినోద్‌కుమార్‌తో సమావేశమైన కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

**అడ్డగుట్ట, జూలై 25 ప్రభాతవార్త:** మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి శాశ్వత మరమ్మత్తులు చేపట్టాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక శుక్రవారం జలమండలి జీఎం వినోద్ కుమార్, డిజీఎం విద్యా సాగర్, ఏఈ శ్రవంతిలతో సమావేశమైయ్యారు. ఈస్ట్, వెస్ట్ మారేడ్‌పల్లి, టీచర్స్ కాలనీ, అంబేద్కర్ నగర్, రెజిమెంటల్ బజార్ ప్రాంతాల్లో డ్రైనేజీలు సమస్య అస్తవ్యస్థంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి శాశ్వత మరమ్మత్తులు చేపట్టాలని జీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేత కొంతం నరేశ్, పాల్గొన్నారు.

### ఫతేనగర్‌లో ఎమ్మెల్యే కార్పొరేటర్, అధికారులు, పర్యటన...

**కెపిహెచ్బి కాలనీ, జూలై 25, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ఫతేనగర్ డివిజన వెంకటేశ్వర్ నగర్‌కి అనుకొని ఉన్న నడకదారి వంతెన శిథిలావస్థలో ఉందని స్థానికులు కార్పొరేటర్ సతీష్ గౌడ్‌కి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పర్యటించి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ బస్తీలో పర్యటించి రైల్వే అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని స్థానిక వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంచి బిక్షపతి, అంబటి శ్రీనివాస్, మల్లేష్, వెంకటేష్, శేఖర్, కవిత, అజయ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పైకి ఎదగాలి

### - మంత్రి జూపల్లి కృష్ణారావు



మంత్రి కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న నాగార్జున స్కూల్ యాజమాన్యం

**కెపిహెచ్బి కాలనీ, జూలై 25, ప్రభాతవార్త**

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీలోని నాగార్జున స్కూల్‌ను మంత్రి కృష్ణారావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్నతనం నుండి క్రమశిక్షణ అలవర్చుకొని శ్రద్ధగా చదివి అనుకున్న లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కమలాకర్ రావు, ప్రిన్సిపాల్ జోగినిపల్లి అనురాధ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 28వ భవ్య కావడి యాత్రకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు

**చార్మినార్, జూలై 25 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీతో పాటు పలు ప్రాంతాలలో ఈ నెల 27వ తేదీన జరగనున్న 28వ భవ్య కావడి యాత్రలో జంట నగరాలలోని పలు ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొననున్నారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ శ్రావణ మాసంలో భాగ్యనగర్ కావడి సేవా సంఘం హైదరాబాద్-సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా భవ్య కావడి శోభాయాత్ర జరగనున్నది. చార్మినార్ సమీపంలోని శ్రీ మహదేవ్ మందిరంలో నిర్వాహకులు కావడి యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను చురుకుగా చేస్తున్నారు. వందల లాది మంది భక్తులు కావడీలను భుజజాలపై పెట్టుకుని భవ్య కావడి యాత్రలో పాల్గొనను న్నారు. జూలై నెల 27వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరం నుంచి భవ్య కావడి యాత్ర ప్రారంభమై గుల్జారాహౌస్, మామాజు మ్లాపాఠక్, కుడా స్టేడియంతో పాటు పలు ప్రాంతాలలో కొనసాగిన అనంతరం శంషాబాద్ మంచిర్యాల గ్రామానికి దగ్గరలో ఉన్న ఓంఫంక్షన్ హాల్‌కు చేరుకుంటుందని సంఘం ప్రతినిధి ఫంకజ్ వర్మ తెలిపారు ఫంక్షన్ హాల్‌లో విశాల్ భండార్, శివ మహా జాగరణ కార్యక్రమాలు జరగనున్నాయని, జూలై నెల 28వ తేదీన బ్రహ్మముహూర్తంలో గంగాజలంతో అభిషేకం జరుగుతుందని ఆయన తెలిపారు

## హౌసింగ్ బోర్డ్ స్థలాలను ఇష్టారాజ్యంగా వేలం వేస్తామంటే ఊరుకోం : ప్రేమకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమకుమార్

**కెపిహెచ్బి కాలనీ, జూలై 25, ప్రభాతవార్త**

హౌసింగ్ బోర్డ్ స్థలాలను ఇష్టారాజ్యంగా వేలం వేస్తామంటే ఊరుకో మనీ కూకట్‌పల్లి జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ప్రేమకుమార్ హెచ్చరించారు. కెపిహెచ్బి కాలనీ ఐదవ ఫేస్ జనసేన పార్టీ ఆఫీస్‌లో ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు పేద ప్రజల సౌలభ్యంతో దేవాలయాలకు, పాఠశాల కొరకు, ఆట స్థలాల కొరకు, 10 స్థలాన్ని కేటాయిస్తూ ఆనాడు ప్రభుత్వం హౌసింగ్ బోర్డ్ ద్వారా ఎకరాల్లో ల్యాండ్ పులింగ్ చేసి ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ రూపేనా వివిధ కేటగిరీల ఇల్లు కట్టించి ప్రజలకు అనుకూలమైన ధరలకు ఇన్స్టాల్మెంట్‌లో అలాట్మెంట్ చేశారనీ, ప్రస్తుతం హౌసింగ్ బోర్డ్ అధికారులు స్థలాలను ప్రవేట్ వ్యక్తులకు వేలం ద్వారా కమర్షియల్ చేసి అమ్ముకొని డబ్బులు దండుకోవాలని చూస్తున్నారనీ ఇది దారుణం అని అన్నారు. హౌసింగ్ బోర్డ్‌లో మిగిలిన ఎకరాల స్థలాలను పాత పద్ధతిలో వివిధ కేటగిరీలలో అన్ని సౌకర్యములతో ఇల్లు కట్టించి అనుకూలమైన ధరలతో ప్రజలకు అలాట్మెంట్ చేయవలసిందిగా జనసేన తరపున హౌసింగ్ బోర్డ్ అధికారులను కోరుతున్నామని అన్నారు. ఇప్పటి వరకు వేలం ద్వారా వచ్చిన ధనమును కొంత శాతం హౌసింగ్ బోర్డ్ కాలనీ డెవలప్మెంట్ కొరకు వాడాలని, ఏసియాలోనే అతిపెద్ద హౌసింగ్ బోర్డ్‌లో పిల్లలు క్రికెట్ ఆడుకోవడానికి ఆటస్థలం లేదని, కైలాపూర్ గ్రౌండ్‌ని పిల్లల ఆడుకోవడానికి అన్ని సౌకర్యాలతో కేటాయించాలని కోరుతూ పేద ప్రజల శుభకార్యాలకై కేటాయించిన ఫంక్షన్ హాల్‌ని కూడా వేలం వేయడానికి హౌసింగ్ బోర్డ్ అధికారుల ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది అన్నారు. అట్టి దారుణం జరిగినచో తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, కలిగినీడి ప్రసాద్, అంజి, సుంకర సాయి, బండిరెడ్డి క్రాంతి, పులగం సుబ్బు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు భద్రత కిట్లు పంపిణీ



కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్

**జీడిమెట్ల, జూలై 25, ప్రభాతవార్త**

సుభాష్ నగర్ డివిజన్‌కు చెందిన పారిశుధ్య కార్మికులకు శుక్రవారం కార్పొరేటర్ గుడిమెట్ల హేమలత సురేష్ రెడ్డి ఏఎంహెచ్‌ఓ డాక్టర్ కవితతో కలిసి భద్రత కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిహెచ్ఎంసి సిబ్బంది నిరంతరం పారిశుధ్య నిర్వహణ కోసం ఎంతో కృషి చేస్తున్నారని, మీరు చేసే సేవ వెలకట్టలేనిదని కార్పొరేటర్ గుడిమెట్ల హేమలత సురేష్ రెడ్డి ప్రశంసించారు. ప్రజలు పరిశుభ్రమైన వాతావరణం లో ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు నిరంతరం పని చేస్తున్న కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మాస్కులు, కొబ్బరి నూనె, షూస్, శాని టైజర్ లతో కూడిన కిట్లను అందజేశారు. విధి నిర్వహణలో వీటిని వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వర్షాకాలంలో కార్మికులకు ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని, మీ భద్రతే మాకు ముఖ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, జిహెచ్ఎంసి సిబ్బంది జిలాని, మహిళా అధ్యక్షురాలు మంగ, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, రత్న తదితరులు పాల్గొన్నారు.

### 29న దూలపల్లిలో అంతర్జాతీయ పులుల దినోత్సవం



**పేట్ బషీరాబాద్, జూలై 25, ప్రభాతవార్త**

అంతర్జాతీయ పులుల దినోత్సవం 2025ను ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఇందులో భాగంగా శుక్రవారం నగరంలోని 4 ప్రభుత్వ, 23 ప్రైవేట్ పాఠశాలల నుండి దాదాపుగా 350 మంది విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయులను, తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ, దూలపల్లి ఆహ్వానించింది. విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్, క్విజ్ పోటీలను నిర్వహించి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, పులుల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ పోటీలయందు జెడ్‌పిహెచ్ఎస్ కొంపల్లి విద్యార్థులు ప్రథమ స్థానంలో, శ్రీ చైతన్య స్కూల్ 1 కొంపల్లి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీలలో విజేతలను నిర్ణయించి జులై 29న తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ, దూలపల్లిలో జరగనున్న అంతర్జాతీయ పులుల దినోత్సవంలో బహుమతులు, సర్టిఫికేట్లను ప్రధానం చేయనున్నారు. కే. శ్రీనివాసులు, వినయ్ కుమార్ సాహు, ఎం. వంశీ కృష్ణ, డిప్యూటీ డైరెక్టర్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వై. శుభాష్ చంద్ర యాదవ్, ఎఫ్ఆర్‌ఓ, ఏ. అనంత్ రెడ్డి, ఐ. ఉష, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### లులుమాల్‌లో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



**కెపిహెచ్బి కాలనీ, జూలై 25, ప్రభాతవార్త**

కూకట్ పల్లిలోని లులు మాల్ లో కార్గిల్ విజయ్ దివస్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. భారత సైన్యం ఆధ్వర్యంలో విజయోత్సవం పేరిట ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు రీజనల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదర్ పేర్కొన్నారు. 3 రోజుల పాటు జరిగే ఈ సంబరాలు ఈ నెల 25న ప్రారంభమై 27న ముగుస్తాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఈ 3 రోజులు మాల్‌లో భారత సైన్యం ఆయుధాలను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ఇండియన్ ఆర్మీ శక్తి సామర్థ్యాలను తెలిపేలా ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. అంతే కాకుండా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న హైదరాబాద్‌కు చెందిన నాటి జవాన్లను ఘనంగా సన్మానించనున్నట్లు రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్, మాల్ మేనేజర్ ఎడిల్ అరసన్ వెల్లడించారు. మాల్‌లో ఏర్పాటు చేసే ఆర్మీ ఆయుధాల ప్రదర్శనను సందర్శకులు ఉచితంగా చూడవచ్చని వివరించారు. పాఠశాల విద్యార్థులకు ఇదొక మంచి అవకాశమని, పాఠశాల యాజమాన్యాలు వారి విద్యార్థులను తీసుకు వచ్చి ప్రదర్శన చూసేలా చేయాలని కోరారు. దీని వల్ల పిల్లలు భారత సైన్యం శక్తి సామర్థ్యాలు, గొప్పతనం తెలుసుకుంటారని చెప్పారు.



సికింద్రాబాద్ లోయర్ ట్యాంక్ బండ్ ఆల్పెన్ టవర్స్ ఎదురుగా విద్యుత్ స్తంభం తొలగించి క్రింద భాగం వదలడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న దృశ్యం

### యువత కొరియోగ్రఫీపై దృష్టిసారించాలి : వనశ్రీరావు



కొరియోగ్రఫీ శిక్షణా శిబిరంలో శిక్షణనిస్తున్న గురువులు, అభ్యసిస్తున్న ఔత్సాహిక యువత

**రవీంద్రభారతి, జూలై 25 ప్రభాతవార్త :** నేటి కళాజగత్తులో కొరియోగ్రఫీ ఆవశ్యకత, ప్రాముఖ్యత చాలా పెరగడంతో అదొక కళాత్మక ఉపాధికి బాటలు వేస్తోందని, అందుకే యువత కొరియోగ్రఫీపై అవగాహన పెంచుకొని దానిపై దృష్టిసారించి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరచుకొని పేరుప్రఖ్యాతులు పొందాలని ప్రఖ్యాత నాట్యగురువు వనశ్రీరావు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నేటి నుండి 3రోజులపాటు కొరియోగ్రఫీ, కొత్త ఆలోచనలు అనే అంశంపై ప్రారంభమైన శిక్షణా శిబిరానికి వనశ్రీరావు ముఖ్యఅతిథిగా హాజరై సంస్థ అధ్యక్షురాలు కిరణ్మయి, పద్మకళ్యాణి, వసీంరాజు, ఇందిరా పరాసరం తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి శిక్షణా శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. అకాడమీ తరచు విలక్షణమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతకు వివిధ అంశాలపై అవగాహన పెంచుతూ ప్రోత్సహించడం శ్లాఘనీయమని వారి కళాసేవను కొనియాడారు. కొరియోగ్రఫీ, కొత్త ఆలోచనలు యువతకు సంపూర్ణంగా తెలియజేయడానికే మూడురోజుల శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. యువత పెద్ద యెత్తులో పాల్గొని అవగాహన పెంపొందించుకొని లబ్ది పొంది శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### తన్మయుల్ని చేసిన అమృత కూచిపూడి నృత్యాంజలి



కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసిన నాట్యగురువులు

**రవీంద్రభారతి, జూలై 25 ప్రభాతవార్త :** ప్రఖ్యాత సాంస్కృతిక కళాసంస్థ అమృత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఉదయం నుండి సాయంత్రం వరకు సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శిష్యులచే సమర్పించబడిన కూచిపూడి నృత్యాంజలి 2025 విచ్చేసిన అశేష ప్రేక్షకులను తన్మయుల్ని చేసి ప్రశంసలందుకుంది. సంస్థ గురువు డా. కె.సాయిగీత నేతృత్వంలో 150మందికిపైగా ఆమె శిష్యులు కూచిపూడి నృత్యశైలిలో వివిధ అంశాలతో ప్రదర్శనలివ్వడం జరిగింది. ముఖ్యంగా తాండవ నృత్యకరీ, సిద్దేంద్రయోగి విరచిత భామాకలాపం, కృష్ణశబ్దం, స్వాగతం కృష్ణ, దశావతారశబ్దం, జతిస్వరం, ఆనందతాండవం తదితర అంశాలు కళాకారుల శృతి లయబద్ధ అద్భుత హావభావాల ప్రదర్శన నేత్రపర్వం కావించాయి. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.శేషుకుమార్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. చివరిగా కూచిపూడి నృత్యంజలిలో కళాప్రదర్శనలు కావించిన కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి శుభాశీస్సులు అందజేశారు. సంస్థను, నాట్యగురువు కళాసేవను కొనియాడారు.

## ఆసుపత్రిలో పసిబాలున్ని వదిలివేసిన గుర్తు తెలియని మహిళా



ఆస్పత్రిలో వదిలేసిన బాబు చిత్రం

**బేగంబజార్, జూలై 25ప్రభాతవార్త:** గుర్తు తెలియని మహిళా ఓ పసిబాలున్ని ప్రసూతి ఆసుపత్రిలో వదిలి వేసిన సంఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరసింహ కథనం ప్రకారం... ఓ గుర్తు తెలియని మహిళా పసిబాలున్ని వెంట తీసుకుని సుల్తాన్‌బజార్ ప్రసూతి ఆసుపత్రికి శుక్రవారం వచ్చింది. చికిత్స నిమిత్తం అందరికి మాదిరిగానే క్యూలైన్లలో నిల్చున్న గుర్తు తెలియని మహిళా అక్కడ ఉన్న మరో మహిళాకు ఆ పసి బాలున్ని అప్పగించి ఇప్పుడే మూత్ర విసర్జనకువెళ్లి వస్తానని చెప్పిన సదరు మహిళా ఎంత సేపటికి రాలేదన్నారు. పసి బాలున్ని పట్టుకున్న మహిళా ఆసుపత్రిలోని పలుచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మరో పేషంట్ సహకారంతో ఆసుపత్రి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆసుపత్రి వర్గాలు సిసి టివి పుటేజ్‌లను పరిశీలించారు. ఆ గుర్తు తెలియనిమహిళా వదిలి వేసి పరారీ అయినట్లు గుర్తించి వెంటనే సుల్తాన్‌బజార్ పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న ఎస్.ఐ వేణు మరోసారి సిసి టివి పుటేజ్‌లను పరిశీలించారు. సదరు మహిళా పారిపోయినట్లు గుర్తించారు. ఆచూకీ తెలిసిన వారు సుల్తాన్‌బజార్ పోలీసులను సంప్రదించ వచ్చునన్నారు. ఈ కేసును సుల్తాన్‌బజార్ ఎస్ఐ వేణు దర్యాప్తు చేస్తున్నారు.

## కూకట్‌పల్లిలో సమస్యలపై పర్యటించిన ఎమ్మెల్యే కృష్ణారావు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

**కెపిహెచ్బి కాలనీ, జూలై 25, ప్రభాతవార్త**

కెపిహెచ్బి కాలనీ, ఫతేనగర్ డివిజన్‌లలో శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి పర్యటించారు. ముఖ్యంగా ప్రజలు ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కూకట్‌పల్లిలో ఇప్పటికే గత పదేళ్ల కాలంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణంలు చేపట్టామని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభా నేపథ్యంలో కొత్త ఫ్లై ఓవర్లు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాలు చేయడానికి ఇందులో భాగంగా వసంత నగర్ కాలనీ నుంచి గోకుల్ ఫ్లాట్స్ మీదుగా హై టెన్షన్ రోడ్డులో రైలు ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం, కూకట్‌పల్లి హుడా ట్రాక్ పార్క్ స్థలము క్రీడా ప్రాంగణంగా మార్చుటకు పరిశీలన చేయాలన్నారు. అలాగే జేఎన్టీయూ సర్కిల్ అభివృద్ధికి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి స్కై వే ఏర్పాటు చేయడం కోసం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మూసాపేట ఆంజనేయ నగర్ చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం, కూకట్పల్లి వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ఫ్లైఓవర్ బ్రిడ్జ్, అండర్ పాస్ నిర్మాణం కోసం చర్యలు చేపట్టే విధంగా నిర్ణయించారు. అనంతరం ఫతేనగర్ వెంకటేశ్వర నగర్‌లో పాత నడక బ్రిడ్జ్ శిథిలావస్థకు చేరుకోవడంతో దానికి నూతనంగా నిర్మాణం చేసేటట్లు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు. పండాల సతీష్ గౌడ్, ఎస్సీ చిన్నారెడ్డి, ఈ ఈ రమేష్, డి ఈ శంకర్, ఏయి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిల రిజర్వేషన్‌లపై కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

### బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

**సైఫాబాద్, జులై 25 ప్రభాతవార్త:** బిసిలకు కల్పించే రిజర్వేషన్‌లలో ముస్లింలకు 10 శాతం వస్తుందని, మిగిలిన 32 శాతం మాత్రమే బిసిలకు వస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. ఈ రిజర్వేషన్‌లలో ముస్లింలకు 10 శాతం కాదు కాదా ఒక్క శాతం కూడా రావని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిఇ కింద వచ్చే ముస్లిం రిజర్వేషన్‌లు ఎన్నికలకు సంబంధించి కాదని విద్యా, ఉద్యోగ రంగాలకు మాత్రమే పరిమితమని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు, సిఎఎ, ఈడబ్ల్యూఎస్ పేరిట అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్‌లు కేటాయించిన బిజెపి ప్రభుత్వానికి బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అసాధ్యమా ? అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా బిజెపి, కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి బిసి రిజర్వేషన్‌లను వ్యతిరేకిస్తూ రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. విపి సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు బిపి మండల్ సిఫార్సులను అమలు చేయడానికి ప్రయత్నించినప్పుడు బిజెపి నేత ఎల్.కె.అద్వానీ ఆధ్వర్యంలో రిజర్వేషన్‌ల వ్యతిరేకం ఉద్యమం నడిపిన చరిత్ర బిజెపిదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బిసిల రిజర్వేషన్‌లపై బిజెపి వైఖరి ఎంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్‌లపై బిజెపి ద్వంధ వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. బిసిల రిజర్వేషన్‌లపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, జి.కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 78 సంవత్సరాల పాలనలో ఆదిపత్య దోపిడీ కులాలు బడుగుల రాజ్యాధికారాన్ని అడ్డుకుంటున్నాయని విమర్శించారు. నాడు తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితను స్ఫూర్తిగా తీసుకుని కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ యుద్ధం ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జాతీయ కార్యదర్శి పి.సుధాకర్‌ముదిరాజ్, నాయకులు కోలా జనార్ధన్, మీనగా గోపి, చెన్న రాములు, తాళ్లపలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్రపురి కాలనీ పై వచ్చే ఆరోపణలకు స్వస్థి

### -కాలనీ అధ్యక్షులు వల్లభనేని అనిల్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు అనిల్‌కుమార్ తదితరుల

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** చిత్రపురి కాలనీపై కొన్ని సంవత్సరాలుగా ఎన్నో ఆరోపణలతో వస్తున్నాయని వాటన్నింటికి స్వస్థి పలికే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆకాలనీ అధ్యక్షులు వల్లభనేని అనిల్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఫిలింనగర్లో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో చిత్రపురి కాలనీలో కొత్తగా నిర్మించబోతున్న నిర్మాణాలు, టవర్స్ కి సంబంధించిన వాటిపై సభ్యులు అభిప్రాయాలను వెల్లడించారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూసాధారణంగా చిత్రపురి కాలనీలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి అందరం ఒక కుటుంబ సభ్యులులాగా కూర్చుని సమావేశంలో సమస్యల గురించిచర్చించుకుంటామన్నారు. కానీఈ మధ్యకాలంలో కొంతమంది, కావాలనే సమావేశంలో మాట్లాడకుండా చలోఫిలిం ఛాంబర్, చలో గాంధీభవన్ అంటూ, ఇంటి బయటికి వస్తున్నరాని ఆరోపించారు. వారిలో అసలు చిత్రపురి కాలనీకి సంబంధం లేని ఉండటం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. కాలనీలో ఎన్నో అవకతవకలు జరుగుతున్నట్లు, అలాగే కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు ఆరోపిస్తూ, నిరసనలు చేయడం ఎంతవరకు సమంజసం కాదన్నారు. ఈ కారణంగా కాలనీలో ఉండే ఎంతోమంది భయాందోళనలకు గురవుతున్నట్లు తెలిపారు. చిత్రపురి కాలనీలో 4,713 వేల కుటుంబాలు ఇప్పటికే నివాసం ఉంటున్నట్లు తెలిపారు. 700 నుండి 850 కోట్ల మధ్య ఉన్న చిత్రపురి కాలనీ పై సుమారు 3000 కోట్లకు పైగా అవినీతి జరిగినట్లు ఆరోపించే వారు చిత్రపురి కాలనీ స్థలం ఉచితంగా రాలేదనీ విషయాన్ని వెల్లడించారు. ఆరోపణలు చేసే వారితో బహిరంగంగా మాట్లాడేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని మీడియా సమక్షంలో చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సభ్యులు రఘు రామకృష్ణ, లలిత, అలహరిలు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి కృషి

### : బానుక నర్మద

**కంటోన్మెంట్, జూలై 25 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి దశలవారిగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. శుక్రవారం 2వ వార్డు ఇందిరమ్మ నగర్‌లోని మూడు ప్రాంతాల్లో 15 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్మధ మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ సహాయ సహకారాలతో బోర్డు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయించుకొని పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు బిజెపి అధ్యక్షులు శ్రవన్, నాయకులు మాదారపు అశోక్, శ్యామ్, సతీష్, ప్రశాంత్, అనీల్, ఐలయ్య, నరేందర్, రమేశ్, బాబు తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE PRINICIPAL JUNIOR CIVIL JDUGE CUM XIV ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS R.R.DIST. AT: HAYATHNAGAR**
**O.S. No. 537 OF 2025**

Between
**1 Peddi Radha,** W/o. Peddi Ramesh, Aged: 59 Years, Occ: House wife,
**2 Peddi Karthik,** S/o. Peddi Ramesh, Aged: 37 Years, Occ: Pvt Job,
Both are R/o. H.No.15-66/29/22, New TMR Enclave, Near TKR College, Meerpet, Balpur Mandal R.R.dist
**3 Santoshi Peddi** W/o. Vijay Kumar Arwapally, D/o. Peddi Ramesh, R/o. Aged: 35 Years, Occ: House maker,R/o. H.No. 14-5-205, Chudi Bazar, near jain mandi, Begumbazar, Nampally, Hyderabad ...**Plaintiffs**
And
**1 Bandi Kishore,** S/o. B.Eshwaraiah, Aged: 40 Years, Occ: Business, R/o. H.No. Durga Homes, Phase I, Ameenpur Village, Miyapur, Hyderabad PIN: 502032
**2 All Concerned ...Defendants**

**NOTICE**

To
**All Concerned ...Defendant No.2**
Please take notice that the above named Plaintiffs have filed a suit for declaration of legal heirs of deceased by name Late Peedi Ramesh, S/o. P. Kantaiah in respect of the suit schedule of properties i.e open Plot No.9, admeasuring 200 Sq.Yards or 167.23 Sq. Mtrs in Survey Nos. 490/A and 491/AA Situated at Ragannaguda Village H/o. Turakayamjal village and Mandal, (previously) Hayathnagar Mandal, Raganna guda Grampanchayath R.R.Dist, and bounded by: North : Plot No.8, South: Plot No. 10, East: Others land, West 30 Feet wide Road, 47/2, open plot No.8, admeasuring 68 Sq. Yards or 57.12 Sq. Mtrs in Survey Nos. 279 Situated at Achampet Village & Mandal, Nagakurnool dist (previously) Mahaboob nagar Dist and bounded by: North: Lingal Road, South: Road, East G. Sujatha plot : West : P.Thirupathaiah plot and agricultural land admeasuring Ac.2.16 Gts in Survey No. 312/E and admeasuring Ac.2.02 Gts in Sy.No. 312/A/1, total admeasuring Ac.4.18 Gts situated at Polisetty pally village, Balmur Mandal, Nagarkurnool dist and bounded by: North : others land, South : land of P Radha, East Road, West : Land of Peddi Thirupathaiah
If any persons are having objection or right, title, interest and claim whatsoever in and over the aforementioned property and Late Peedi Ramesh, S/o. P. Kantaiah they may appear before the Honble Court on **05/08/2025 at 10:30 A.M,** if you fails to appear before the Hon'ble Court on the above said date and time, the case will be decided in your absences as per law.
BY ORDER OF THE HON'BLE COURT
**K. RAMA MURTHY, Advocate**
H.No. 8-6-641, Plot No.5A1, Sairam Colony, B.N.Reddy Nagar, R.R.District.



**IN THE HON'BLE I ADDL.JUNIOR CIVIL JUDGE-CUM-V ADDL. METROPOLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: L.B.NAGAR**
**O.S. No. 926 of 2025**

**Between:**
Smt. Swayampaakula Sailaja @ Sailaja Pisapati, And 2 others ...**Plaintiffs**
**AND**
1) The Tahasildar, Ghatkesar, Ghatkesar Mandal, Medchal-Malkajgiri District
2) All Concerned ...**Defendants**
To
1) The Tahasildar Ghatkesar, Ghatkesar Mandal, Medchal-Malkajgiri District
2) All Concerned

**NOTICE FOR APPEARANCE**

Please take notice that the above named Plaintiffs filed the above suit bearing O.S.No.926/2025 for declaration the Plaintiffs as legal heirs of the deceased Late Swayampaakula Shiva Raaj, in respect of the suit schedule property, i.e., All that bearing open Plot No. 29 in Survey No.729, admeasuring 150sq. yards, situated at Korremula Village and Gram Panchayat, Ghatkesar Mandal, Medchal-Malkajgiri District (Previously Ranga Reddy District) and bounded by: **North :** Plot No. 28, **South :** Plot No. 30, **East:** Plot No. 24, **West :** 30' Wide Road. The Hon'ble court was pleased to order the notice through substitute service by publishing in the said news paper, thus take the notice that the above suit is posted to 19-08-2025 at 10-30 AM for your appearance either in person or through your Advocate duly instructed by you, otherwise, the matter will be decided as per Law.
**(By order of the Hon'ble Court)**
**Sd/- Govardhan Reddy**
Advocate
H.No.8-12-96/BN/12, Plot No.12, Sri Balaji Colony, TKR Collage Road, Karmanghat, Hyderabad 500097
**Cell: 9908645722**



**IN THE COURT OF HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY, AT: L.B NAGAR**
**O.S. No. 473 OF 2025**

BETWEEN:
**1. Konkipudi Durga Bai,** W/o. Late Konkipudi Prasad, Aged about 47 years, Occ: Housewife, R/o. H.No. 23-124/2, Tygaraya Nagar, Saroor Nagar, KV Ranga Reddy District, TG-500 035.
**2. Konkipudi Sai Surya Pavan,** S/o. Late Konkipudi Prasad, Aged about 23 years, Occ: Student, R/o. H.No. 23-124/2, Tygaraya Nagar, Saroor Nagar, KV Ranga Reddy District, TG-500 035. ...**Plaintiffs**
AND
**1. The Tahsildar,**
O/o. Mandal Revenue Officer, Road No. 13, Gayathri Nagar, at Saroor Nagar, Saroor Nagar Mandal, Ranga Reddy District, TG-500 035.
**2. All Concerned ...Defendants**
Take notice that the Plaintiffs herein have filed the above suit for Declaration to declare the Plaintiffs as legal heirs and successor of Late. Konkipudi Prasad. That the above case is posted on **20-08-2025** for objections if any. As such if any person or persons have any objection then they may approach the Hon'ble Court and put forth their objection if any on the above referred date at **10:30 AM,** before the Hon'ble Court failing which order will be passed basing on the available record.
"BY ORDER OF THE HON'BLE COURT"
**Sd/- M. SWAPNA**
**Advocate**
#Unit No. 312, 3 rd Floor, Downtown Mall, Lakdikapul, Hyderabad, TG-500 004.



**IN THE COURT OF THE HON'BLE I ADDL. SENIOR CIVIL JUDGE-CUM-ADDL. CHIEF JUDICIAL MAGISTRATE: MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MALKAJGIRI**
**O.S. No. 169 OF 2021**

BETWEEN:
**J. MOHAN ...PLAINTIFF**
AND
**SMT. SUREKHA DEVI AND OTHERS ...DEFENDANTS**
To,
**1. Boppa Raju Ravindranath** S/o. B.R. Rao, Aged 59 years, Occ: Business,
**2. Smt. Gangadasu Vijayalakshmi,** W/o. Boppa Raju Ravindranath, Aged 55 years, Occ: Business,
Both reside at R/o. H.No.1-3-95, Street No.4/3, Habsiguda, Hyderabad
**...DEFENDANT No.s 4 &5**
The Plaintiff had filed the above Suit vide O.S. No. 169 Of 2021 seeking suit for declaration of title, declaration of documents as null & void and injunction against the Defendants which is pending before this Hon'ble Court, and the said matter is posted for your appearance on **30.07.2025.** Therefore, you are hereby directed to appear before this Hon'ble Court on the above said date i.e., **30.07.2025 at 10:30 A.M.** either in person or through your counsel, failing which the matter will be decided in your absence as per law.
//BY ORDER OF THE HONOURABLE COURT//
**Sd/- S. NAGESH REDDY**
**ADVOCATES**
Flat No. 101 & 102, #6-3-663/7/6, Jaffar Ali Bagh, Somajiguda, Hyd-82.

## ఓబిసిల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

### : చెకోలేకర్ శ్రీనివాస్



ఓబీసీ కుల సమావేశంలో పాల్గొన్న చెకోలేకర్ శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట ,జూలై 25 ,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన ఓబీసీ కుల సమావేశానికి మలక్పేట్ నుంచి నాయకులు కార్యకర్తలు కలిసి ఆయన తగిలింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుల గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. కులగణన కార్యక్రమం శాస్త్రీయంగా, సమగ్రంగా జరిగిందని వివరించారు.

## లబ్ధిదారులకు సిఎం నిధి చెక్కులు పంపిణీ



**మల్కాజ్గిరి జూలై25,ప్రభాతవార్త :**

మల్కాజ్గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మురుగేష్ అమినుద్దీన్ మేకల రాము యాదవ్ భాగ్య నంద్ రావు, మహేష్ నవాబ్ దినేష్, రాజు,కాశి యాదవ్, బాల స్వామి, జానకిరామ్,రామదాసు,చందు ఉష,వైశాలి, పాల్గొన్నారు.

### దుర్గానగర్ కాలనీ అధ్యక్షుడిగా వంగ జగన్నాథ్ రెడ్డి ఎన్నిక



దుర్గా నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

**సైదాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ దుర్గానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా వంగ జగన్నాథ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాలనీలోని దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన కాలనీ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా బిల్లకంటి కిరణ్ కుమార్ గుప్తా, గౌరవ అధ్యక్షుడిగా ఎ.యాదవ కృష్ణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బు సందీప్ కుమార్, రామకృష్ణాచారి, రవి ప్రశాంత్ చారి, సంయుక్త కార్యదర్శులుగా సతీష్ కుమార్, దశరథరామ్ రెడ్డి, బిల్లకంటి శ్రీనివాస్ గుప్తా, ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ప్రదీప్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ముఖ్య సలహాదారుగా కె.యాదగిరి రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వంగ జగన్నాథ్ రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

### ఐఎస్ సదన్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి : కార్పొరేటర్ శ్వేత



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎస్‌బిహెచ్ ఆఫీసర్స్ కాలనీలో రూ.14.20లక్షల వ్యయంతో చేపడుతున్న పార్కు కాంపౌండ్ వాల్ పనులను ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు శ్రీనివాస్, రఘు, మురళి, ప్రసాద్, నాగరాజు, వెంకటరత్నం పాల్గొన్నారు.

## శివపురి కాలనీలో సిసి రోడ్డు ప్రారంభం



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 24 ప్రభాతవార్త:**

లింగోజిగూడ డివిజన్ శివపురి కాలనీలో రూ.60లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివపురి కాలనీలో ఇంటర్నల్ రోడ్లను దాదాపు రూ.62లక్షలతో పూర్తి చేయడం జరిగిందన్నారు. కాలనీలో మిగిలిన మెయిన్ రోడ్డును కూడా త్వరలోనే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. మ్యాన్‌హోల్స్‌లోని పూడికను తీయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అవసరమైన చోట నూతన విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఎఇ విజయ్ కుమార్, వాటర్‌వర్క్స్ ఎఇ పవిత్ర, ఎలక్ట్రికల్ ఎఇ నవీద్, కాలనీవాసులు బెల్ల నర్సింహాగుప్తా, కృష్ణారెడ్డి, బుజ్జి, రాజేష్‌గౌడ్, నాయకులు శ్రీధర్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రావణ మాసంలో తొలి శుక్రవారం సందర్భంగా సైదాబాద్ మాతా మైదానంలోని శ్రీ విజయదుర్గా మాత దేవాలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు ( ప్రభాతవార్త, సైదాబాద్)

## విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

### : ఓయూ జాయింట్ డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జాయింట్ డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, యాదగిరి రెడ్డి, చంద్రయ్య గౌడ్, ప్రేమలత, కల్పన తదితరులు

**మలక్ పేట ,జూలై 25, ప్రభాతవార్త:**

విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీనాథ్ రెడ్డి పేర్కొన్నారు దిల్ షుక్ నగర్ లోని న్యూ నోబుల్ డిగ్రీ కళాశాల ఓరియంటేషన్, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓయూ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, కళాశాల మేనేజ్ మెంట్ సభ్యులు యాదగిరి రెడ్డి, కల్పన , కళాశాల ఇన్చార్జి గౌని చంద్ర గౌడ్,, ప్రిన్సిపాల్ ప్రేమలతలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకుటిత దీక్ష, పట్టుదలతో తమ లక్ష్యసాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. కళాశాల మేనేజ్ మెంట్ సభ్యులు యాదగిరిరెడ్డి, కల్పన, కళాశాల ఇన్చార్జి గౌని చంద్రయ్య గౌడ్, ప్రిన్సిపల్ ప్రేమలతలు మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతనువెలికి తీయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అత్యుత్తమ అధ్యాపక బృందంతో, ఆధునాతన పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్క ృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# 26న చలో హైదరాబాద్ సిడిఎంఎ

### : సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్

**తుర్కయంజాల్, జులై 25, ప్రభాతవార్త:** మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ కార్మికులందరు 26వ తేదీన చలో హైదరాబాద్ సిడిఎంఏ కు పెద్ద ఎత్తున తరలిరావాలని యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ పత్రిక ప్రక్కటన విడుదల చేస్తూ కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. డి కిషన్ మాట్లాడుతూ, కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేసి కనీస వేతనం 26000 వేల రూపాయలు నిర్ణయించాలని, మున్సిపల్ శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారి చదువు మరియు వృత్తి నైపుణ్యతను గుర్తించి జవాన్లుగా, డ్రైవర్లుగా, శానిటరీ ఇన్స్పెక్టర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా మొదటి ప్రాధాన్యత ఇచ్చి ప్రమోషన్స్ కల్పించాలని, కార్మికులు వివిధ కారణాల రీత్యా మరణిస్తే దహన ఖర్చులకు 30 వేల రూపాయలు కేటాయించాలని, ఎక్స్ గ్రేషియా రూ.5లక్షలు నష్ట పరిహారం ఇచ్చి మరణించిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశం కల్పించాలని, ప్రతి కార్మికునికి వారాంతపు సెలవులతోపాటు పండుగల సందర్భంగా సెలవులు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, పెరుగుతున్న పట్టణ విస్తరణకనుగుణంగా కొత్త సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లాలో ఉన్న మున్సిపల్ కార్మికులు అందరూ చలో హైదరాబాద్ సిడిఎంఏ కు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కిషన్ పత్రికా ప్రకటన విడుదల చేస్తూ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

# డంపింగ్‌యార్డ్‌గా మారుతున్న ఓపెన్ ప్లాట్

**-ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు**

**-వర్షాలతో వ్యాప్తి చెందుతున్న క్రిమికీటకాలు**

**-ఆందోళన చెందుతున్న కాలనీవాసులు**



చెత్త చెదారంతో కూరుకుపోయిన దృశ్యం

**ఎల్.బి.నగర్, జూలై 25 ప్రభాతవార్త:**

ఓపెన్‌ప్లాట్లు డంపింగ్‌యార్డ్‌గా మారుతున్నాయి. ఓ పక్క భారీ వర్షాలు మరోపక్క చెత్తాచెదారంతో కూరుకుపోయిన ఓపెన్‌ప్లాట్ క్రిమికీటకాలు వ్యాప్తిచెంది ప్రజలు వ్యాధుల బారినపడే ప్రమాదం నెలకొంది. కొత్తపేట డివిజన్ మారుతీ నగర్‌లోని జైన్‌మందిర్ వెనకభాగాన చాలా సంవత్సరాలుగా ఈ సమస్య కాలనీవాసులను వెంటాడుతుంది. జిహెచ్‌ఎంసి అధికారులు పారిశుద్ధ విభాగం అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ ప్లాట్లో చుట్టుపక్కల వారు చెత్తాచెదారం వేస్తుండడం అందులో పిచ్చి చెట్లు మొలకెత్తడం ప్రమాదకరంగా మారింది. చుట్టుపక్కల వారు చెత్తను వేయకుండా పారిశుధ్య విభాగం నివారించకపోవడంతో రోజురోజుకు ఓపెన్ ప్లాట్లు చెత్త పెరిగిపోతుంది. ప్లాట్ మొత్తం పిచ్చి చెట్లు వెలవడంతో పైనుంచి పచ్చదనం కనిపిస్తున్న కింద పూర్తిగా చెత్తాచెదారంతో కూరుకుపోవడం గమనార్హం. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకూడదు, నీరు నిలువ ఉంచకూడదు అంటూ ప్రచారం చేపడుతున్న జిహెచ్ ఎంసికి ఇటువంటి సమస్యలు కనిపించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే చెత్తను తొలగించడంతోపాటు చుట్టుపక్కల వారు చెత్త వేయకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలి

### రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రామచందర్‌రావు



కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు: పక్కన తెలంగాణ రాష్ట్ర కిసాన్‌మోర్చా ఎపిఎంసి కన్వీనర్ ఏనుగు రాంరెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూలై 25 ప్రభాతవార్త:**

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడ రోడ్ నాదర్‌గుల్ రెవెన్యూ పరిధిలోని పోచమ్మ దేవాలయం సమీపంలో మాజీ ఎంపిటిసి, తెలంగాణ రాష్ట్ర కిసాన్‌మోర్చా ఎపిఎంసి కన్వీనర్ ఏనుగు రాంరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎఆర్ఆర్ రిసార్ట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా నాదర్‌గుల్‌లోని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఇంచార్జి, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుపరిపాలన అందించే బిజెపి వైపు ప్రజలు చూస్తున్నారని అన్నారు. గతంలో నగర, పట్టణ ప్రాంతాలకే పరిమితమైన బిజెపి నేడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తరించి ప్రజలకు చేరువైందని ఆయన వెల్లడించారు. రాబోయే జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో వార్డు, సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికల్లో బిజెపి పోటీ చేసి అధిక స్థానాలను దక్కించుకుంటుందని ఆయన వివరించారు. హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న రంగారెడ్డి జిల్లాలో పార్టీ సత్తా చాటి గతంలో ఎన్నడూ లేని విధంగా మెజార్టీ సీట్లను సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో రంగారెడ్డి జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, రాష్ట్ర నాయకులు సుధాకర్ శర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ యెల్మేటి దేవేందర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్రనాయకులు పాపయ్యగౌడ్, కడారి జంగయ్య యాదవ్, ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, తర్రె మల్లేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, సింగిల్ విండో మాజీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు పెత్తుల్ల పుల్లారెడ్డి, ఏనుగు వెంకట్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, బంగారు ప్రభాకర్, మర్రి ప్రభాకర్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, రామిడి శూరకర్ణారెడ్డి, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్, ముత్తంగి కరుణానిధి, రాత్లావత్ నీలా రవినాయక్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

**కాశీబుగ్గను సందర్శించిన రామచందర్‌రావు**

అనంతరం బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లోని చారిత్రక కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని రామచందర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు చక్రవర్తుల జగన్మోహనాచార్యులు, మంగు రాఘవరావు, చక్రవర్తుల మదన్మోహనాచార్యులు, ప్రమోద్, భువన చందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిల్వ ఉన్న నీటితో దోమల వ్యాప్తి

### : కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి



ఎంటమాలజి సిబ్బందికి కిట్స్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఎంటమాలజి సిబ్బందికి కిట్స్‌ను పంపిణీ చేసిన అనంతరం కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ నిల్వ ఉన్న నీరు దోమలకు కేంద్రంగా మారుతుందని, దోమలు వ్యాప్తి చెందుతాయని అన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

### నాలుగు రోజులపాటు ఘనంగా బోనాల ఉత్సవాలు



బోనాల ఆహ్వాన పత్రికను కెఎల్ఆర్‌కు అందజేస్తున్న గణేష్‌నేత

**ఎల్.బి.నగర్, జూలై 25 ప్రభాతవార్త:**

విజయపురికాలనీలోని పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ అమ్మవార్లగుడి (మూడు గుళ్ళు) వద్ద ఈ నెల 31వ తేదీ గురువారం నుంచి ఆగస్టు మూడవ తేదీ వరకు బోనాల ఉత్సవాలు నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత తెలిపారు. 31వ తేదీన ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, ఆగస్టు 1వ తేదీన శ్రీరేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం, 3వ తేదీన అమ్మవార్లకు బోనాలు సమర్పించుట, సాయింత్రం శ్రీమైసమ్మ అమ్మవారి ఫలహార బండి ఊరేగింపు ఉత్సవము నిర్వహిస్తామన్నారు. వివిధ కాలనీల నుంచి శ్రీఖిల్లామైసమ్మ అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి హాజరుకావాలని కోరుతూ శుక్రవారం ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బండి మధుసూదన్‌రావ్, ఉపాధ్యక్షులు గట్ల రవీంద్ర పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి అపూర్వస్పందన



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**ఎల్.బి.నగర్, జూలై 25 ప్రభాతవార్త:** నాగోల్ సుప్రియ ఆసుపత్రి వారి సౌజన్యంతో జాతీయ శ్రవణ, నిర్వహించిన ఉచితంగా వైద్య భాషన దివ్యాంగుల సంస్థ, కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ఆధ్వర్యంలో పరీక్షలు పరికరాల వితరణ శిబిరానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. జనరల్ ఫిజీషియన్ ఆర్థోపెడిక్ వైద్యులు సుమారు 200 మందికి శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. వినికిడి సమస్యలు, కీళ్ల నొప్పులు, గొంతు తదితర సమస్యలకు సంబంధించి శిబిరంలో పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలోలింగాల జగదీశ్వర్ రెడ్డి, గంగిడి నర సింహా రెడ్డి, సుప్రజా ఆసుపత్రి ఎండి విజయ్ కుమార్, సీఎం అజయ్ కుమార్ గౌడ్, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఉదయ్, ప్రియ, సిద్దు, శివ సాయి, జట్ట మహేశ్వర్, కార్తికేయన్ పాల్గొన్నారు.

### రాష్ట్ర బిజెపి సారథికి పార్టీ శ్రేణుల ఘన స్వాగతం



రాంచందర్‌రావుకు గజమాలతో ఘన స్వాగతం పలుకుతున్న బిజెపి నాయకులు: చిత్రంలో అందెల శ్రీరాములు యాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూలై 25 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర బిజెపి నూతన సారథిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా రంగారెడ్డి జిల్లాలోని ప్రతిష్టాత్మక మహేశ్వరం నియోజకవర్గానికి విచ్చేసిన ఎన్.రామచందర్‌రావుకు ఇక్కడి బిజెపి శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. కుర్మల్‌గూడ రోడ్‌లోని కార్యక్రమానికి హాజరవుతున్న ఆయనకు మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నాదర్‌గుల్‌లో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. అనంతరం క్రేను సాయంతో భారీ గజమాలతో ఆయనకు సాదర స్వాగతం పలికారు. రామచందర్‌రావు రాకను స్వాగతిస్తూ పెద్ద ఎత్తున కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడి రాక పార్టీ క్యాడర్‌లో కొత్త జోష్‌ను నింపింది. రామచందర్‌రావుకు స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## డివిజన్ అభివృద్ధికి కృషి : కార్పొరేటర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొటర్ రాగుల.

**వనస్థలిపురం. జూలై. 25.ప్రభాతవార్త.**

గత సంవత్సర కాలంలోనే రూ.24 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడంవల్లనే ఇది సాధ్యమైందని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్రెడ్డి అన్నారు. శుక్రవారం వనస్థలిపురం ఎఫ్సీఐ కాలనీలో ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన పత్రికా విలేకాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పలు కాలనీలలో రూ. 18 కోట్ల నిధులతో చేపట్టిన పనులు పూర్తయ్యాయని, రూ.6.5 కోట్లతో చేస్తున్న పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. మరో రూ.1.70 కోట్ల పనులు మంజూరు అయ్యాయని, పనులు ప్రారంభించాల్సి వుందని అన్నారు. అలాగే మరో రూ.6 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని అన్నారు. హెచ్ఎండీఏ నిధులు రూ.3.20 కోట్లతో బబుల్ ట్రీ పార్క్, షెడ్డు, జయశంకర్ పార్క్. పోలీస్‌స్టేషన్ సమీపంలోని పార్క్, అభ్యుదయ నగరలోని పార్కులను అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. క్రిస్టియన్ కాలనీ, గుంటి జంగయ్యనగర్, జనప్రియహోమ్స్, జహంగీర్ నగర్, నాగార్జున కాలనీలలో వరదనీటి సమస్య పరిష్కారానికి శాశ్వత పనులు చేపట్టడం జరిగిందని రాబోయే రెండు నెలల కాలంలో కాలనీలలో మిగతా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎల్బీనగర్ ఇంచార్జి మధుయాస్కం గౌడ్ సహకారంతో ఈ మంచి అభివృద్ధిపనులు చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ విఘ్నేశ్వరి. జేడీఓ కృష్ణారెడ్డి, నాయకులు హరీంద్రరెడ్డి, సాయికిరణ్, నిరంజన్, రవి తదితరులు పాల్గొన్నారు

### ధర్నాకు వెళ్లడానికి కార్మికులకు అనుమతినివ్వాలి: సిఐటియు



మీర్‌పేట్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమీషనర్ నాగేందర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

**సరూర్‌నగర్, జూలై 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ల ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సిడిఎంఎ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సిఐటియు గౌరవ అధ్యక్షుడు దాసరి బాబు పిలుపునిచ్చారు. ప్రతిష్టాత్మకంగా శాంతియుతంగా నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమానికి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు, ఉద్యోగులు తరలివెళ్ళడానికి శనివారం అనుమతినివ్వాలని కోరుతూ ఆయన శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమీషనర్ పేరిట ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులకు సరైన జీతాలు లేక దుర్భర జీవితం గడుపుతున్నారనీ ఈ మేరకు వారికి నెలకు రూ.26 వేల చొప్పున వేతనాలు ఇవ్వాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయని అన్నారు. అదే విధంగా ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న ధర్నాకు పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి నర్సింహ, బావమ్మ, కమలమ్మ, లలిత పాల్గొన్నారు.

**మీర్‌పేట్ సీనియర్ నేత ఎరుకల రవిగౌడ్‌కు పితృ వియోగం**

**సరూర్‌నగర్, జూలై 25 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సీనియర్ నాయకుడు ఎరుకల రవిగౌడ్‌కు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి ఎరుకల వెంకటయ్యగౌడ్ తీవ్ర అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. మీర్‌పేట్‌లో బాగా పేరొందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు 2009లో హఠాన్మరణం చెందిన స్వర్గీయ ఎరుకల రమేష్‌గౌడ్ వెంకటయ్య పెద్ద కుమారుడు. అయితే శుక్రవారం సాయంత్రం వెంకటయ్య మృతితో మీర్‌పేట్ పాతగ్రామం కేశవరెడ్డినగర్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన రెండవ కుమారుడైన రవిగౌడ్‌ను పలువురు పరామర్శించారు. శనివారం ఉదయం మీర్‌పేట్ ప్రధాన స్మశాన వాటికలో అంత్యక్రియలు జరుగుతాయని ఎరుకల కుటుంబ సభ్యులు తెలిపారు.

### నాచారం డివిజన్లో జోనల్ కమిషనర్ పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న జోనల్ కమీషనర్ కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, జులై 25 ప్రభాతవార్త :** నాచారం డివిజన్లోని సమస్యలపై కార్పొరేటర్ విజ్ఞప్తితో డివిజన్లో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ జెడసీకి నాచారంలోని పలు సమస్యలను వారికి వివరించారు. ప్రధానంగా నాచారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో సుమారు నాలుగు సంవత్సరాల క్రితం కూల్చివేయడం జరిగిందని ఆ స్థానంలో నూతన అంగన్వాడి స్కూల్ నిర్మించాలని కోరడం జరిగింది. పటేల్ కుంట చెరువు వద్ద నిర్మించిన శివరేజ్ డైవర్షన్ పైప్లైన్ పనులను తొందరగా పూర్తి చేయాలని కోరారు. అదేవిదంగా ఎర్రకుంట లోని హిందూ స్మశాన వాటికను వైకుంతధామముగా తీర్చిదిద్దాలని చెప్పారు. పటేల్ కుంట చెరువును సుందరీకరించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరడమైనది.రెడ్డి స్మశాన వాటికలో కూలిపోయిన కాంపౌండ్ వాల్ నిర్మించాలని అలాగే మిగిలిన వసతులకు నిధులు మంజూరు చేయాలని కోరడమైనది. డివిజన్లో 5 ప్రాంతాలలో ఓపెన్ జిమ్ములను మంజూరు చేయవలని విజ్ఞప్తి చేశారు. పైన కోరిన అన్ని అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్ స్వయంగా పర్యవేక్షించి సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాప్ర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ వినీత్, బారాసా నాయకులు సాయి జన్ శేఖర్, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యం : డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి



డాక్టర్లతో సమస్యలను తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

**తార్నాక, జూలై 25 ప్రభాతవార్త :**

నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి లాలాపేట్‌లోని ప్రభుత్వ యూ.పీ.హెచ్.సీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు.వారు అక్కడి వైద్య సదుపాయాలను తెలుసుకున్నారు. వర్ష కాలంలో విస్తరిస్తున్న వైరల్ వ్యాధులు, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాల నియంత్రణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌కు వచ్చిన రోగుల సమస్యలు తెలుసుకొని, అవసరమైతే తక్షణ వైద్యం అందించాలని సూచనలు చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ "ప్రజల ఆరోగ్యం ప్రథమ ప్రాధాన్యం. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరిస్తోందని చెప్పారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న మినీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, ఆరోగ్య సేవల విస్తరణకు మంచి ఉదాహరణ."అంతేగాక, వివరించారు.ముఖ్యమంత్రి ఆరోగ్య శ్రీ పథకాన్ని మరింత విస్తృతంగా అమలు చేయడం ద్వారా పేదలకు అధునాతన వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ దవాఖానల్లో డిజిటల్ హెల్త్ రికార్డ్స్, మొబైల్ డయాగ్నొస్టిక్ సదుపాయాలు వంటి ఆధునికతను తీసుకొచ్చామని,ప్రతి డివిజన్‌లో అర్బన్ పిహెచ్ సి బలోపేతం చేస్తూ, రోజువారీ వైద్య సేవలతో పాటు మాతృసేవలు, పిల్లల ఆరోగ్య పరీక్షలు, టీకాలు, మహిళా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.లాలాపేట్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ద్వారా తార్నాక, లాలాగూడ, లాలాపేట్ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.